నేడు ఇద్దరు మంత్రుల పర్యటన

రూ.18.74 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు




ఇల్లెందు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు నియోజకవర్గంలో మంగళవారం రూ.18.74 కోట్లతో చేపట్టే పథకాలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపనలు చేస్తారని, ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. నియోజకవర్గంలోని బయ్యారం, టేకులపల్లి మండలాల్లో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) నిధులతో చేపట్టిన వివిధ పనులు ప్రారంభిస్తారని వెల్లడించారు. బయ్యారం మండలం లక్ష్మీనరసింహపురంలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు, పాకాలవాగుపై గొల్లగూడెం వద్ద హైలెవెల్ బ్రిడ్జి పనులకు,రామచంద్రపురం కొమ్మవరం గ్రామాల్లో నిర్మించనున్న రెండు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపనలు చేస్తారని ఎమ్మెల్యే కనకయ్య తెలిపారు. టేకులపల్లి మండలంలో బేతంపూడి, భద్రుతండానుంచి అబ్బిరెడ్డిగూడెం వరకు బీటీ రోడ్డు పనులకు ముత్యాలంపాడు వద్ద 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తారని కోయగూడెం సింగరేణి కాలరీస్ ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని పరిశీలిస్తారన్నారు.

ఆర్టీఐ కమిషనర్‌గా పీవీ



- పేపర్ బాయ్ స్థాయి నుంచి జర్నలిస్టుగా ప్రస్థానం
- విద్యార్థి దశలో పీడీఎస్‌యూ నేతగా చురుకైన పాత్ర
- స్వస్థలం.. ఖమ్మం నగరం

ఖమ్మం, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నలుగురు ఆర్‌టీఐ కమిషనర్లలో ఖమ్మానికి చెందిన పండ్రంగి వెంకట శ్రీనివాసరావుకు చోటు దక్కింది. పేపర్‌బాయ్ స్థాయి నుంచి జర్నలిస్టుగా ఎదిగి, నేడు ఆర్‌టీఐ కమిషనర్ స్థాయికి చేరుకున్నారు. నలుగురు ఆర్‌టీఐ కమిషనర్లను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశాలు జారీచేశారు. పీవీ శ్రీనివాసరావు స్వస్థలం ఖమ్మం నగరం. వెంకటగిరి గేటు ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావు తల్లిదండ్రులు పండ్రంగి కనకరాజు, సుశీల.

ఖమ్మం శాంతినగర్ హైస్కూల్‌లో పదో తరగతి చదివి, సిద్దారెడ్డి కాలేజీలో ఇంటర్, బీకాం డిగ్రీ పూర్తిచేశారు. ఎల్‌ఎల్‌బీ మధ్యలోనే నిలిపివేశారు. చదువుకునే సమయంలో పీడీఎస్‌యూ పట్ల ఆకర్షితులై జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పదవులు నిర్వహించారు. ఖమ్మంలో పీజీ సెంటర్ ఏర్పాటు కోసం ఉద్యమాలు నిర్వహించారు. విద్యార్థి ఉద్యమంలో విద్య ప్రైవేటీకరణ, కార్పొరేట్ విద్యా కళాశాలకు వ్యతిరేకంగా, క్యాపిటేషన్ ఫీజుకు వ్యతిరేకంగా పనిచేసి అరెస్టు కూడా అయ్యారు. చదువుకునే రోజుల్లో పేపర్‌బాయ్‌గా పార్టు టైమ్ జాబ్ చేశాడు. ఆ తర్వాత జర్నలిజాన్ని వృత్తిగా ఎంచుకున్నారు. పలు ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో జర్నలిస్టుగా పనిచేశారు. టీయూడబ్ల్యూజే, తెలంగాణ జర్నలిస్టు ఫెడరేషన్‌లో నాయకుడిగా కీలక పాత్ర పోషించారు. తెలంగాణ ఉద్యమ తరుణంలో జర్నలిస్టుల పోరాటంలోనూ తనదైన పాత్ర పోషించారు. ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అసెంబ్లీ మీడియా కమిటీ సభ్యుడిగా, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ కోశాధికారిగా పనిచేశారు.

బాధ్యతగా పనిచేస్తా

సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా నియామకం కావడం సంతోషంగా ఉందని, ప్రభుత్వం నమ్మకంతో ఈ అవకాశాన్ని కల్పించిందని, బాధ్యతగా పనిచేస్తానని పీవీ శ్రీనివాసరావు తెలిపారు. కమిషనర్‌గా నియమితుడైన సందర్భంగా అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సమాచార హక్కు కమిషనర్‌గా ప్రజలకు అవసరమైన సమాచారం అందించేందుకు విధి నిర్వహణలో ప్రజలకు మేలు జరిగేలా పనిచేస్తానని, బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని జిల్లాలు పర్యటిస్తానని తెలిపారు.

నేడు పాలీసెట్

- ఖమ్మం జిల్లాలో 5 కేంద్రాలు.. 2,804 మంది విద్యార్థులు
- భద్రాద్రి జిల్లాలో 11 కేంద్రాలు.. 3,352 మంది..
- నిమిషం నిబంధన అమలు... ఏర్పాట్లు పూర్తి...

ఖమ్మం ఖానాపురం హవేలి/చుంచుపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరటానికి ఉద్దేశించిన పాలీసెట్ మంగళవారం జరగనుండగా, ఇరుజిల్లాల్లో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఖమ్మం నగరంలో 5 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,804 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు కో ఆర్డినేటర్, ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో 800మంది, ఎస్‌బీఐటీలో 500మంది, కవిత మెమోరియల్ కళాశాలలో 500మంది, దరిపల్లి అనంతరాములు కళాశాలలో 500మంది, డీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాలలో 504మంది హాజరవుతున్నట్లు తెలిపారు.పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 9గంటల వరకు చేరుకోవాలని, హాల్‌టికెట్, ఆధార్‌కార్డు, హెచ్‌బీ పెన్సిల్, బ్లూ ఆర్ బ్లాక్ పెన్ వెంట తీసుకురావాలని తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాలీసెట్‌కు సకల ఏర్పాట్లు చేశామని కో-ఆర్డినేటర్, రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా (మిగతా 6వ పేజీలో)

'మున్నేరు' కష్టాలకు శాశ్వతంగా చెక్

- 17 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణం
- రూ.676 కోట్లతో చురుగ్గా నిర్మాణ పనులు
- నిర్వాసితులకు పోలేపల్లి వద్ద కాలనీలో ఇళ్ల స్థలాలు
- రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మున్నేరు నది పరీవాహక ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని మున్నేరు ప్రాంతంలో జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతేడాది సెప్టెంబరు నెలలో వచ్చిన వరదల కారణంగా మున్నేరు నదీ పరివాహకంలోని వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయన్నారు. దీనిని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంకల్పించిందన్నారు. పేదలు, సామాన్య ప్రజలు మున్నేరు నదికి ఇరువైపులా జీవిస్తున్నారని వరదల కారణంగా వారి కష్టం వృథా అవుతుందన్నారు. గత ప్రభుత్వ పెద్దలు కేవలం జీవో జారీ చేసి చేతులు దులుపుకొంటే, ప్రజాప్రభుత్వం సీఎం ఆదేశాల ప్రకారం స్థానికంగా వచ్చే వరదను కూడా అంచనా వేస్తూ నదికి ఇరువైపులా 17కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఉన్న చిన్న చిన్న అడ్డంకులను కలెక్టర్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం పగలు, రాత్రి కష్టపడి పరిష్కరిస్తోందన్నారు.

మున్నేరు నది పరీవాహక కుటుంబాలకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది కలుగవద్దనేదే ప్రభుత్వ ఉద్దేశ్యమని, శాశ్వత పరిష్కారం కోసం సుమారు రూ.676 కోట్లతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. 4155 మీటర్ల ఎర్త్ వర్క్, 3495 మీటర్ల సిమెంట్ కాంక్రీట్ పనులు ఇప్పటివరకు పూర్తయ్యాయన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంలో భూములు కోల్పోయే వారిని ఇబ్బంది పెట్టే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. నిర్వాసితులైన నిరుపేదలకు ఎక్కడ ఇబ్బంది, నష్టం రాకుండా రివర్ ఫ్రంట్‌లోనే పోలేపల్లి వద్ద కాలనీ ఏర్పాటు చేసి ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. రిటైనింగ్ వాల్‌కు ఇరువైపులా డ్రెయిన్, (మిగతా 6వ పేజీలో)


రిటైనింగ్ వాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

వ్యవసాయ సీజన్ ముగియడంతో రైతులు తమ పంట పొలాల్లో వరి దుబ్బులను తగలబెడుతున్నారు. అవగాహన లేకుండా ఈ చర్యకు పాల్పడుతుండటంతో వాతావరణ కాలుష్యంతోపాటు వ్యవసాయ భూముల్లో సారానికి ముప్పు ఏర్పడుతోంది. యంత్రాలతో వరికోతలు చేయడం వల్ల వరి మొదళ్లు ఎత్తుగా ఉంటుండటంతో రైతులు వాటిని కాలబెడుతున్నారు. వాస్తవానికి మడిలో నీటి నిల్వ చేసి రొటవేటర్ ద్వారా భూమిలో కుళ్లేలాచేస్తే భూమి సారవంతం కావడంతో పాటు పంటలకు బలం చేకూరుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.



పొలాల్లో నిప్పు..

భూ సారానికి ముప్పు

అవగాహన లేమితో పంట పొలాల్లో వరి దుబ్బులను తగలబెడుతున్న రైతులు

- వరికోతలు ముగియడంతో పలుచోట్ల దహనకాండలు
- అటు పర్యావరణ కాలుష్యం.. ఇటు భూమి సేంద్రీయాలకు నష్టం
- వాయు కాలుష్యంతో ప్రజల ఆరోగ్యానికీ ముప్పు
- యంత్రాలతో వరి కోతలు చేయడమే కారణం
- అధికారుల సూచనలను పట్టించుకోని రైతులు

కల్లూరు/అశ్వారావుపేట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): వరి, పత్తి పంట పండించిన తరువాత రైతులు దుబ్బుల దహనానికి పాల్పడుతున్నారు. 20 ఏళ్ల క్రితం కూలీలు పుష్కలంగా లభించే వారు. అప్పుడు వరి కోత అనంతరం గడ్డిని మోపులుగా కట్టి ఆ తర్వాత వాములు పేర్చి పశువుల మేతకి వినియోగించేవారు. కాలక్రమంలో కూలీల కొరత పెరుగుతూ వచ్చింది. దీంతో రైతులు వరి పంటను కోసేందుకు యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. కంబైన్డ్ హార్వెస్టర్ యంత్రాలతో వరి గడ్డిని పూర్తిగా కోయకుండా పైపైన కొంత వరకు మాత్రమే కోయటంతో గడ్డి కట్టలు కట్టేందుకు పనికి రాని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో వరి గడ్డి మొదలు (దుబ్బులు) అలాగే పొలంలో ఉండి పోతున్నాయి.

మళ్లీ సీజన్ ప్రారంభానికి ముందు రైతులు తమ పొలాల్లో ఉన్న పంట అవశేషాలను తగల బెట్టడం ఒక పనిగా పెట్టుకున్నారు. ఇలా తగలబెటడంతో జరిగే నష్టంపై అవగాహన ఉండటం లేదు. రైతుల చర్య వల్ల పర్యావరణ పరంగా అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల ఉత్పత్తి అయ్యే వేడితో భూమిలో ఉష్ణతాపం పెరిగే అవకాశం ఉంది. ఇలా ఉత్పత్తి అయ్యే వేడి భూమిలో సుమారు సెంటీమీటర్ లోతు వరకు వ్యాపించడం వల్ల భూమి ఉష్ణోగ్రత 33.8 డిగ్రీల నుంచి 42.2 డిగ్రీల వరకు పెరుగుతుంది. భూమి పైపొరలో ఉండే తేమ ఆవిరై పోవడమే కాకుండా, భూమి (మిగతా 6వ పేజీలో)

పంటలకు సరైన పోషకాలు అందవు...

ఐ.వి.శ్రీనివాసరెడ్డి, శాస్త్రవేత్త, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల



ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద గణనీయంగా ఉండేది. రైతులు తాము పండించిన వరిగడ్డిని ఎక్కువగా తామే వాడుకోవటంతో పాటు ఇతరులకు విక్రయించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి చాలా తక్కువగా ఉంది. దీంతో పాటు పంటలు అయిన తర్వాత గడ్డి, కట్టెలను తొలగించటానికి కొంత ఖర్చు అవుతుంది. దీనిని ఖర్చుచేయలేని కొందరు రైతులు సులభంగా ఉందంటూ పొలాల్లోనే దహన కాండ నిర్వహిస్తున్నారు. నేలమీద ఉండే సేంద్రీయ కార్బనం తగలబడుతుంది. భూసారం తగ్గుతుంది. తద్వారా పంటలకు అవసరమైన పోషకాలు అందవు. నేలకు సరిపడా నీరనేది దరిచేరదు. నేల మీద హ్యూమస్ అనే పొర ఏర్పడుంది. భూమికి ఎరువులను నిల్వ ఉంచే శక్తి క్షీణిస్తుంది. ఎంత ఎరువులు వేసినా ఉపయోగం అంతంతే. పంటలకు పనికి వచ్చే అనేక రకాల సూక్ష్మక్రిములు భూమిపై ఉంటాయి. వరిగడ్డి, ఇతర పంటలను తగలబెట్టటం ద్వారా ఇవి పూర్తిగా చనిపోతాయి. కాలుష్యం ద్వారా నత్రజని, మిథైన్, సల్ఫర్‌డయాక్సైడ్ గాల్లో కలుస్తాయి. వర్షాలు పడినపుడు ఇవి ఆమ్లాలు(యాసిడ్‌గా)మారతాయి. మిగిలిన రోజుల్లో ఇవి ఇబ్బందులకు గురిచేస్తాయి. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో రైతులు ఒకేసారి వరిగడ్డిని తగలబెట్టటం ద్వారా దాని ప్రభావం ఢిల్లీ వంటి రాష్ట్రంపై తీవ్రంగా పడుతోంది.

రైతులు పండించిన వరిగడ్డిని తగలబెట్టకుండా నీటిని పెట్టి రొటోవేటర్‌తో దున్నటం ద్వారా భూమిలో కుళ్లుతుంది. దీని ద్వారా పంటలకు సేంద్రీయ ఎరువుల అవసరం ఉండదు. నేలల్లో సూక్ష్మజీవులు ఉండటం ద్వారా పంటలకు తెగుళ్ల బెడద ఉండదు. తద్వారా క్రిమికీటక మందులను వాడే పనిపెద్దగా ఉండదు. పంటకు అయ్యే ఖర్చు తగ్గుతుంది. వేసవి దుక్కుల వలన భూమిలోకి గడ్డి, కట్టెలు వంటివి వేయడం ద్వారా భూమికి శక్తి పెరుగుతుంది.

భూ సేకరణ పూర్తి చేయాలి...

- సీతారామ ప్రాజెక్టు, మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు ఊపందుకోవాలి
- ప్రత్యామ్నాయ లే ఔట్ భూమి అభివృద్ధి పనులు వేగవంతం కావాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఖమ్మం కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, అభివృద్ధి పనులకు ప్రణాళికాబద్ధంగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సీతారామ ఎత్తిపోతల పథకం, మున్నేరు నదీ భూ సేకరణ, ప్రత్యామ్నాయ భూమి లేఔట్ అభివృద్ధిపై జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన మొత్తం భూమి, వీటిలో అసైన్డ్ ప్రభుత్వ పట్టా ఎంత ఉంది, ప్రైవేట్ పట్టా భూమి ఎంత సేకరించాలో స్పష్టమైన సమాచారంతో నివేదిక అందించాలని ఆదేశించారు. అటవీ భూమి ఎంత సేకరించాల్సి ఉంటుందో.. ఆ వివరాలు అందిస్తే ప్రత్యామ్నాయ భూముల్లో అటవీ పెంపకం చేపడతామని అన్నారు. మండలాల వారీగా సేకరించాల్సిన అటవీ భూమి, అసైన్డ్ ప్రభుత్వ భూములు, ప్రైవేట్ పట్టా భూముల వివరాలతో నివేదిక శుక్రవారం నాటికి అందించాలని కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణలో (మిగతా 6వ పేజీలో)

అక్రమ ఫైనాన్స్ వ్యాపారులపై కొరడా

- ఆరుగురిపై కేసు నమోదు
- పేర్లు వెల్లడించని పోలీసులు

ఖమ్మం, మే 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై నగర పోలీసులు సోమవారం కొరడా ఝుళిపించారు. పలువురు వ్యాపారుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించి విలువైన పత్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు కొందరిపై కేసులు నమోదు చేశారు. టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో పలువురు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్స్, అధిక వడ్డీలు, అక్రమ ఫైనాన్స్, గిరిగిరి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. పక్కాగా అందిన సమాచారం మేరకు సోమవారం ఏకకాలంలో 11 చోట్ల దాడులు నిర్వహించి తనిఖీలు చేశారు. రూ.లక్షల విలువ చేసే 120 ఖాళీ చెక్కులు, 570 ప్రామిసరీ నోట్లు, 38 బాండ్లను స్వాధీనం చేసుకున్నారు. చిట్టీల నిర్వాహకులు తమ కస్టమర్ల నుంచి సేకరించిన డబ్బును తిరిగి చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం, దౌర్జన్యాలు, దాడులు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్న క్రమంలో ఈ తనిఖీలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. దీనికి సంబంధించి ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అధిక వడ్డీ పేరుతో సామాన్య, మధ్య తరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, ఆరుగురిపై కేసులు నమోదు చేశామని చెబుతున్న పోలీసులు.. వారి పేర్లు, వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం.


ఖమ్మంలో రహదారిపై నిరసన తెలుపుతున్న 25వ డివిజన్ ప్రజలు

డ్రెయినేజీ సమస్య తీర్చాలని...

నగరంలోని 25వ డివిజన్‌లో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. డ్రెయినేజీ, ఇతర పనులను కేఎంసీ అధికారులు అసంపూర్తిగా నిలిపివేశారని ఆరోపిస్తూ స్థానిక కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ ఆధ్వర్యంలో ప్రజలు నిరసనకు దిగారు. ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ గాంధీపార్కు నుంచి విజయలక్ష్మి హాస్పటల్ సమీపంలోని ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించి బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. దీంతో కార్పొరేటర్‌కు పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకొంది. అనంతరం కార్పొరేటర్ నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చి ప్రజావాణి కార్యక్రమంలో ఉన్న అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లాకు సమస్యను వివరించారు. వర్షాకాలం లోపుగా డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకుడు గోళ్ల వెంకటేశ్వర్లు, కాలనీ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం సంక్షేమ విభాగం

అరుగుపై కూర్చుని.. అర్జీలు స్వీకరించి...


కావడిగుండ్లలో అరుగుపై కూర్చుని గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే

- గిరిజన గూడేల్లో ఉత్సాహంగా ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన
- రూ.2.38 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
- రూ.97కోట్లతో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): అరుగుపై కూర్చుని అర్జీలు స్వీకరిస్తూ.. నేలపై కూర్చుని గిరిజనుల కష్టాలు వింటూ సమస్యల పరిష్కారానికి హామీలు ఇస్తూ అశ్వారావుపేట మండలంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సోమవారం విస్తృతంగా పర్యటించారు. రూ.2.38 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు చేస్తూ మొదటిసారి గిరిజన గ్రామాలను చుడుతూ ఉత్సాహంగా పర్యటన సాగించారు.

అశ్వారావుపేట మండలంలో సోమవారం ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. పేరాయిగూడెంలో గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.1.32 కోట్లతో చేపట్టిన 14 సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం గిరిజన గ్రామాలు ఎమ్మెల్యే ఆదినారాయణ దత్తత గ్రామమైన చెన్నాపురంలో పర్యటించారు. అక్కడ రూ.1.07కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అక్కడే గిరిజనులతో కలిసి నేలపై కూర్చుని వారితో మాట్లాడారు. వారి సమస్యలను విన్నారు. అనంతరం కావడిగుండ్ల, కన్నాయిగూడెం గ్రామాల్లో పర్యటించి అరుగుపై కూర్చుని గిరిజనుల దరఖాస్తులు స్వీకరించారు. పలువురు తమ సమస్యలను తెలపగా పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం శ్రమించే జారే ఆదినారాయణ లాంటి ఎమ్మెల్యే మీకు ఉండటం ఎంతో అదృష్టమని అన్నారు. తన నిధులతో ఖమ్మం నియోజకవర్గంలోనే రూ.4కోట్లతో పనులు చేస్తే అశ్వారావుపేట నియోజకవర్గంలో మాత్రం రూ.5కోట్లతో పనులు చేపట్టటం జరిగిందన్నారు. తన పార్లమెంటు పరిధిలో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని, పదేళ్లకాలంలో చేయని అభివృద్ధిని కాంగ్రెస్ అనతికాలంలోనే చేసి చూపిందన్నారు.

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ గిరిజనులు తమ పిల్లలను తప్పకుండా బడులకు పంపి మంచిగా చదివించాలని కోరారు. తాను విద్య, వైద్యానికే మొదటి (మిగతా 6వ పేజీలో)

పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోండి

ఖమ్మం స్పోర్ట్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా యువ పౌరులను జాతీయ ప్రయోజనాలు, అత్యవసర, సంక్షోభ పరిస్థితుల్లో వినియోగించుకునేందుకు మై భారత్ సివిల్ డిఫెన్స్ వలంటీర్లుగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం మై భారత్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్.అన్వేష్ ఓ ప్రకటనలో ఆసక్తి గల యువతను మై భారత్ పోర్టల్ ద్వారా తక్షణమే తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పౌర రక్షణ వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి వారిని ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ప్రజా అత్యవసర పరిస్థితులు, భద్రతా సమస్యల దృష్ట్యా వారి సేవలను వినియోగించుకోవడంతో పాటు రెస్క్యూ, గాయ పడ్డ వారిని తరలింపు, ప్రథమ చికిత్స, అత్యవసర సంరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, జన సమూహ నియంత్రణ, ప్రజా భద్రత, విపత్తు ప్రతిస్పందన, పునరావాస కేంద్రాల్లో సహాయం చేయడం వంటి కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. ఆసక్తి గల ఉత్సాహవంతులైన యువత మై భారత్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9491383832 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సోమవారం శ్రీయోగానంద లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించా రు. సాయంత్రం అలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారిని ఆసీనులను చేశారు. తొలుత దేవస్థానం ఈవో రమాదేవి స్వామివారికి పట్టువస్త్రాలు అందజేశారు. కల్యాణంలో భాగంగా తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రవర, యోత్ర బంధనం, రక్షా బంధనం నిర్వహించారు. కన్యావరుణ గావించి వధూవరులైన స్వామివారికి జీలకర్ర బెల్లం పెట్టారు. అనంతరం దేవస్థానం వారిచే అందజేసిన ముత్యాల తలంబ్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణ వేడుకల్లో దేవస్థానం ఈవో రమాదేవి, దేవస్థానం ఉప ప్రధాన అర్చకుడు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, సంస్కృత పండితుడు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు, ముఖ్య అర్చకుడు అమరవాది మధుసూదనాచార్యులు, అర్చకుడు సౌమిత్రి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు. మంగళవారం నాడు స్వామి వారికి రథోత్సవం నిర్వహించనున్నారు.

ఖమ్మంలో....

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గుట్టపై స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరహరి నర్సింహాచార్యులు, రామకృష్ణా చార్యులు, శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొత్తూరు జగన్‌మోహన్‌రావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం ఆలయంలో విశేష పూజలు, బాలభోగ నివేదన, 108 కళశాలతో మూలవిరాట్‌కు అభిషేకం, విశేష అలంకరణ, స్వామిని పెండ్లి కుమారుడిని చేయుట, ముత్తైదువ మహిళలచే తలంబ్రాల కలుపుట, సాయంత్రం తలంబ్రాల ఊరేగింపు, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు.కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు

నేలకొండపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి):వైశాఖ బుద్ధ పూర్ణిమ 2569వ బుద్ధ జయంతిని పురస్కరించుకుని సోమవారం నేలకొండపల్లి పీఏ స్వార్ సెంటర్ నుంచి బౌద్ధస్థూపం వరకు బుద్ధిస్టులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బౌద్ధస్థూపం వద్ద బుద్ధ వందనం, పంచశీల చదివి బుద్ధ జయంత్యుత్సవాలను ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దదైన నేలకొండపల్లి బౌద్ధక్షేత్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని జయంత్యుత్సవాల్లో పాల్గొన్న బుద్ధ అభిమానులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పడికత్తుల వీరయ్య, రాజేశ్వరరావు, బసవయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

> వేసవి కాలం భరించలేని ఉష్ణతాపాన్నే కాదు.. నోరూరించే ఎన్నో మధుర ఫలాలను సైతం వెంట తీసుకొస్తుంది. అలాంటి పండ్లలో తాటి ముంజలు ఒకటి. ఐస్ యాపిల్‌గా పిలిచే ఈ తాటి ముంజలు ధరలు కూడా అందుబాటులో ఉండటంతో ఇవి అన్ని వర్గాల వారి ఆదరణకు నోచుకుంటున్నాయి.



నోరూరించే తాటి ముంజలు

ఖమ్మం సాంస్కృతికం, మే 12 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్ల నుంచి తీసే ఈ ముంజలు గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా లభిస్తాయి. చుట్టు పక్కల జిల్లాలనుంచి ఖమ్మం నగరానికి పెద్ద ఎత్తున దిగుమతి అవుతుండటంతో ఖమ్మం వాసులకు అందుబాటులో ఉన్నాయి. గుండ్రంగా.. నల్లగా ఉండే తాటి కాయలను చెక్కితే ముంజలు దర్శనమిస్తాయి. నగరంలో ఎక్కడ చూసినా ఇవే కనిపిస్తున్నాయి. నల్గొండ, వరంగల్, కృష్ణా జిల్లాలకు చెందిన పలువురు తాటి తాయలను ఆటోలు, ట్రాక్టర్లలో వేసుకొని నగరానికి తీసుకు వస్తున్నారు. నగరానికి దాదాపు వంద వాహనాల్లో వేలాది కాయలను దిగుమతి చేస్తున్నారు. వాటిని వినియోగ దారుల కళ్లముందే తాటికాయలను ఒలిచి ముంజలుగా తీసి ఇస్తుండటంతో కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు మహిళలు ముంజలను తట్టల్లో, బుట్టల్లో తీసుకొచ్చి నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. తాటి ముంజలు డజను రూ.50 నుంచి డజను రూ.70వరకు విక్రయిస్తున్నారు. తాటికాయల్లోని నీరు ఆధారంగా ముంజలు ఏర్పడటం వల్ల తెల్లగా, జెల్లీ మాదిరిగా లిచీ పండ్ల మాదిరిగా ఉంటాయి.

ఔషధ పరంగా కూడా...

తాటి ముంజలను రుచి కోసం తినటమే కాక వీటిలో ఔషధ గుణాలు ఉండడం.. ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తుండటంతో ఆదరణ మరింత అధికమైంది. వేసవిలో వంటిపై ఏర్పడే చెమటకాయల నిరోధానికి, వంట్లో వేడిమిని తగ్గించేందుకు ఉపకరిస్తాయని ప్రజలు భావిస్తారు. ముంజల్లో ఏ,బీ,సీ విటమిన్లతోపాటు, క్యాల్షియం, ఐరన్, జింక్, పొటాషియం, ఫాస్పరస్ వంటివి పుష్కలంగా ఉండటంతో శరీరానికి మేలు చేస్తాయి. తాటిముంజలను తినటం వల్ల కాలేయ సంబంధిత వ్యాధులు దూరం కావటంతో పాటు కొన్ని రకాల క్యాన్సర్లను నిరోధించటం, జీర్ణశక్తి పెంపొందటం, మలబద్ధకం, ఏసిడిటీ వంటి సమస్యలు సైతం దూరం అవుతాయని భావిస్తారు. శరీరంలో గ్లూకోజ్ స్థాయిని పెంచుతాయి కనుక తక్షణ శక్తిని ఇస్తాయి. మినరల్స్, న్యూట్రియంట్ల శాతాన్ని బ్యాలెన్స్ చేస్తాయి. కడుపు ఉబ్బరాన్ని వాయువును తగ్గిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను నిరోధిస్తుంది.

పొట్టు తీయకుండా తినాలి

చాలామంది తాటి ముంజలను పొట్టు తొలగించి తింటారు. ఈ పొట్టు వగరుగా ఉండటమే ఇందుకు కారణం. అయితే ముంజలను పొట్టుతో సహా తింటేనే పూర్తి ప్రయోజనాలుంటాయని వైద్యులు సూచిస్తారు. పొట్టు చలువ చేయటంతోపాటు పోషకాలు లభిస్తాయి.



ఆదరణ బాగుంది..

చైతన్య నల్గొండ జిల్లా..

తాటికాయల నుంచి అప్పటికప్పుడు తీసే ముంజలకు ఆదరణ బాగుంది. అందుకే వ్యయప్రయాసలైనా సరే సూర్యాపేట, నడిగూడెం, నల్గొండ ప్రాంతాల నుంచి తాటి కాయలను ఖమ్మానికి తీసుకు వస్తున్నాం. మరికొందరు వేరే జిల్లాల నుంచి కూడా దిగుమతి చేస్తున్నారు. వినియోగదారుల ముందు తీసే ముంజలను ఎక్కువగా ఇష్ట పడతారు. తాటి కాయలను తీసుకు రావటానికి తెల్లవారు జామున నాలుగు గంటల నుంచే మా కార్యక్రమం మొదలవుతుంది. చెట్టు నుంచి తాటి గెలలు కొట్టటం వాటిని ఆటోలు, ట్రాక్టర్లలో నగరానికి తీసుకు వస్తాము.



ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు

నూతన కోర్సులు మంజూరు

ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.చిన్నప్పయ్య

ఇల్లెందు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో బీఏ గ్రూపులో 'కంటెంట్ అండ్ క్రియేటివ్ రేటింగ్స్', బీకాంలో 'ఈ-కామర్స్ ఆపరేషన్, బీఎస్సీ గ్రూపులో 'హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్' నూతన కోర్సులు మంజూరు అయ్యాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాటాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఇల్లెందు డిగ్రీ కళాశాలకు మూడు నూతన కోర్సులను మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దేవసేన, మల్టీజోన్ వన్ జేడీ డీఎస్ఆర్ రాజేందర్ సింగ్ మల్టీ జోన్, రెండో జేడీ బాల భాస్కర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ తీసుకోవడానికి ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యం ఏర్పాటు చేశామని, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు కావాల్సిన ప్రతి సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. అడ్మిషన్ల కొరకై ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.చిన్నప్పయ్య, సెల్ నెంబరు 99282 22961, కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు సెల్ నెంబరు 99599 32070, కళాశాల అడ్మిషన్స్ మెంబర్స్ బి.సరిత 8522810271, డాక్టర్ జి.శేఖర్ 8317644101, దోస్త్ టెక్నికల్ అసిస్టెంట్ పి.లక్ష్మణ్‌రావు 9963 889471 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు

ఐదు రోజుల శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయులకు వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా జిల్లాస్థాయి శిబిరాలు మొదటి విడత ఈనెల 13 నుంచి ప్రారంభం కానున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల 17వరకు కొనసాగనున్నాయని తెలిపారు. రెండో విడత తరగతులు ఈనెల 20 నుంచి, 3వ విడత 27 నుంచి ప్రారంభంకానున్నాయని తెలిపారు. ప్రతి విడతలో ఐదు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. మొదటి విడతలో ఆంగ్లం 326, గణితం 453, ఎస్ఏ సోషల్ 436, సబ్జెక్టు ఉపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్స్ 168, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు, ఆర్పీలు 62 మంది పాల్గొంటారని తెలిపారు. మొదటి విడత శిక్షణ శిబిరం నగరంలోని మమత రోడ్ హార్వెస్ట్ పాఠశాలలో ప్రారంభంకానున్నదని తెలిపారు. ఈ నెల 12న కోర్సుల కో ఆర్డినేటర్లకు, రిసోర్స్ పర్సన్‌లతో సంసిద్ధత సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు షెడ్యూల్ ప్రకారం ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొనాలని, ఎవరికి మినహాయింపులు లేవని డీఈవో తెలిపారు.

'మున్నేరు' కష్టాలకు శాశ్వతంగా చెక్


మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

(5వ పేజీ తరువాయి)

బీటీ రోడ్డు ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేసినట్లు తెలిపారు. అనంతరం మంత్రి జలగంనగర్, నాయుడుపేట వద్ద తీగలవంతెన పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో, అగ్రిమెంట్ తేదీలోగా పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకూబ్, ఆర్డీవో నరసింహారావు, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్ కుమార్, తహసీల్దార్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

(5వ పేజీ తరువాయి)

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భూముల సేకరణ సర్వే నిమిత్తం డీజీపీఎ ఆధునిక సర్వే యంత్రాలతో సర్వేయర్ల బృందాలను ఏర్పాటు చేసి జూన్ 12నాటికి వివిధ కేటగిరీల వారీగా భూ సేకరణ తుది నివేదిక సిద్ధం చేయాలన్నారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు 11 విద్యుత్ స్తంభాలు, నాలుగు టవర్లు షిఫ్టింగ్‌కు సంబంధించిన ప్రతిపాదనలు అందించాలని, దీనికి అవసరమైన చెల్లింపులు విద్యుత్ శాఖకు వారం రోజులలో అందజేయాలని ఆదేశించారు..

- మున్నేరు నదీ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణకు రైతులకు, నిర్వాసితులకు అందించే ప్రత్యామ్నాయ భూముల లేఔట్ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మే 25 నాటికి ప్రజలను క్షేత్రస్థాయిలో తీసుకుని వెళ్లి లేఔట్ చూపించాలన్నారు. రాబోయే వర్షా కాలం లోపు నిర్ణీత పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంలో గ్యాప్స్ ఉండటానికి వీలు లేదన్నారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ 17 కిలో మీటర్ల స్ట్రెచ్‌లో పూర్తి స్థాయిలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం, ప్రత్యామ్నాయ లేఔట్ భూమి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని దశల వారీగా అవసరమైన నిధుల చెల్లింపులు అయ్యేలా చూస్తామన్నారు. ప్రజలకు అందించే భూముల్లో లేఔట్ అభివృద్ధి అంతర్గత రోడ్లు, కనెక్టివిటీ అంశాలు ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీసీ ఎం.రాజేశ్వరి, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్ గౌడ్, ఇరిగేషన్ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాసులు, నీటిపారుదలశాఖ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో నిప్పు.. భూసారానికి ముప్పు

(5వ పేజీ తరువాయి)

సేంద్రియ నాణ్యతతో పాటుగా గాలి నాణ్యత కూడా దెబ్బతింటుంది. మరోపక్క రైతుల కంటి చూపు, గొంతు, ముక్కు సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది.

ఖమ్మం జిల్లా కల్లూరు మండల పరిధిలోని పలువురు రైతులు పలు గ్రామాల్లో ఇదే తంతుగా పంట పొలాల్లో వరి మొదలు (దుబ్బులు) తగల బెడుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కల్లూరు మండలం వరి సాగులో అగ్రగామిగా నిలిచింది. ఇక్కడ 33 వేల ఎకరాలకుపైగా వరి రెండు పంటలు సాగవుతోంది. పంట పొలాల్లో రెండు సీజన్ల పంటలు పండించటంపై దృష్టి సారించిన రైతులు కాలవ్యవధితో పంట పొలాలు శుభ్రం



చేస్తున్నామనే భావనతో పంట దుబ్బులు తగలబెడుతున్నట్టు చెబుతున్నారు.

పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో రైతులు ప్రతీ ఏటా ఇలా వరి దుబ్బులను తగలబెట్టినప్పడల్లా దేశ రాజధాని ఢిల్లీ కాలుష్యం కోరల్లో చిక్కుకుపోతుంది. గాలిలో నాణ్యత పడిపోయి జనం తీవ్ర ఇబ్బందులు పడే దృశ్యాలు అందరికీ తెలిసినవే. దీంతో ఢిల్లీ సర్కారు వాహనాల రాకపోకలపై నియంత్రణ పెడుతుంది. అలాగే కాలుష్యాన్ని తగ్గించే యంత్రాలను పలు ప్రాంతాల్లో అమర్చుతుంది. అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి ఎంతో భారం కలుగుతుంది. ఆ పరిస్థితి ఇక్కడ రాకముందే రైతులు తమ చర్యలను మానుకోవాలని పలువురు కోరుతున్నారు. వరి మొదళ్లను తగలబెట్టకుండా, పొలంలో నీటిని నిల్వ చేసి రొటోవేటర్‌తో దున్నటం ద్వారా భూమిలో కుళ్లేలా చేయవచ్చని, తద్వారా పంటలకు సేంద్రీయ ఎరువుల అవసరం ఉండదని శాస్త్రవేత్తలు ఎప్పటి నుంచో చెబుతున్నారు.

భూమి కోల్పోయే పోషకాలు	
పోషకం పేరు	పరిమాణం (కేజీల్లో)
నత్రజని	5.5
భాస్వరం	2.3
పొటాషియం	25.0
గంధకం	1.0

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం...

ఎం.రూప, ఏవో, కల్లూరు



పంట పొలాల్లో దుబ్బులు తగల బెటడం వల్ల అనేక రకాలుగా రైతులకు నష్టం జరుగుతుంది. భూసారం తగ్గి మొక్కల ఎదుగుదలకు ఉపయోగపడే పోషకాలు, బ్యాక్టీరియా, శిలీంద్రాలు నశించి పోతాయి. సేంద్రియ నాణ్యత దెబ్బతింటుంది. భూమి పైపొరలో ఉండే తేమ ఆవిరై పోతుంది. ఇప్పటికైనా రైతులు పొలాల్లో మొదలు (దుబ్బులు) తగలబెట్టడం మానివేయాలి. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

భారత జాతీయ ఉద్యమంలో

కమ్యూనిస్టులది కీలకపాత్ర

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని



కొత్తగూడెం టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత జాతీయ ఉద్యమంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను కాపాడే విధంగా పరిపాలన సాగిస్తోందని ఆరోపించారు. సోమవారం మంచికంటి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫాసిజంపై కమ్యూనిజం విజయం సాధించి 50 ఏళ్ల పూర్తయిందన్నారు. ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా సోవియట్ వీరసైన్యం నిలిచిందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భావప్రకటన స్వేచ్ఛపై దాడి చేయడంపై మెజార్టీ ప్రజల్లో అసహనం పెరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు అన్నవరపు కనకయ్య, ఏజే.రమేష్, లిక్కి, బాలరాజు, భూక్య రమేష్, సందకూరి లక్ష్మి, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, కొండపల్లి శ్రీధర్, నందిపాటి రమేష్, ఇందిరా, నిరంజన్, లక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

అరుగుపై కూర్చుని..అర్జీలు స్వీకరించి

(5వ పేజీ తరువాయి)

ప్రాధాన్యత ఇస్తానని, ఎక్కడ సమస్య ఉంటే అక్కడకు వచ్చి పరిష్కరిస్తానని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో రూ.97కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. దత్తత గ్రామంలో అన్ని రకాల పనుల చేపట్టామని, రూపాయి ఖర్చు లేకుండా సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్‌ను అందించేందుకునే కావడిగుండ్లలో సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించి పనులు ప్రారంభించటం జరిగిందన్నారు.

అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే ప్రసిద్ధ ఆలయం గుబ్బల మంగమ్మ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జూపల్లి రమేశ్, మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు, ప్రత్యేక అధికారి ప్రదీప్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పీఆర్ డీఈఈ శ్రీధర్, తహసీల్దారు కృష్ణప్రసాద్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, గ్రామపెద్దలు, గిరిజనులు పాల్గొన్నారు.


సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నేడు పాలీసెట్

(5వ పేజీ తరువాయి)

3,352 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కొత్తగూడెంలో 6, భద్రాచలంలో 2, మణుగూరులో 3 మొత్తం 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రెండు గంటల ముందుగానే చేరుకోవాలని సూచించారు. నిమిషం నిబంధన అమలులో ఉన్న నేపథ్యంలో సకాలంలో హాజరుకావాలని, ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించమని స్పష్టం చేశారు.

మండుతున్న ఎండలు..

మణుగూరు మే 12 (ఆంధ్రజ్యోతి): మణుగూరు డివిజన్‌లో ఎండలు మండిపోతున్నాయి.


నిర్మానుష్యంగా ఉన్న మణుగూరు ప్రధాన కూడలి

ఉదయం 8.30 గంటల నుంచే బానుడు ప్రతాపం చూపడంతో ఎండల వేడికి ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. 10 గంటల నుంచి రోడ్లు అన్ని నిర్మానుషంగా మారడం ఆరంభిస్తున్నాయి. మధ్యాహ్న సమయంలో జనసంచారం కన్పించని రీతిలో ఎండలు కాస్తున్నాయి. దాదాపు 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నా దాని ప్రభావం మాత్రం 47 మించినట్లుగా ప్రజలు చవిచూస్తున్నారు. ఇక సింగరేణి కార్మికుల పరిస్థితి మాత్రం వర్ణనాతీతంగా మారింది. ఓసీలో బయటి వాతావరణం కంటే మరో నాలుగు నుంచి ఐదు డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగి ఉంటుంది. దీంతో ఓసీ గనుల్లో పనిచేసే కార్మికులు ఈ ఎండలకు తట్టుకో లేక కొందరు సెలవులు పెట్టి ఇంట్లో ఉండిపోతున్నారు.

అంతా ఆయన కోసమేనా..!

» ఆచార్యులను నియమించకుండానే లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

భద్రాచలం, మే 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం ఆచార్యులను నియమించకుండానే నిర్వహించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 10 నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా, ఆచార్యులు, బ్రహ్మల ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఓ కీలక వైదిక సిబ్బంది కోసం ఆచార్యుల స్థానంలో ఎవరిని నియమించకుండా బ్రహ్మే ఆచార్యులుగా కూడా బాధ్యతలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇటీవల నిర్వహించిన శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సమయంలో బ్రహ్మ స్థానంలో వివాదం చోటు చేసుకోగా ఆనాడు వైదిక సిబ్బంది ఆచార్య బ్రహ్మలు లేకుండా ఉత్సవాలు నిర్వహించలేమని స్పష్టం చేశారు. ఈ సమయంలో ఇందుకు సంబంధించి ఒక వీడియోను సైతం సామాజిక మాధ్యమాల్లో వారు విడుదల చేశారు. ఆ సమయంలో వారు యోగానంద లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సమయంలో నిర్వహించే కల్యాణంతో ఆచార్యులు, బ్రహ్మల పేర్లు ఖరారు అవుతాయని వారి ఆధ్వర్యంలోనే ఏడాది పొడవునా స్వామి వార్ల ఉత్సవాలు జరుగుతాయని స్పష్టం చేశారు. మరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహించిన సమయంలో ఆచార్యుల నియామకం జరుగకుండా ఏ విధంగా కల్యాణం పూర్తి చేశారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. కాగా ఒక కీలక వైదిక సిబ్బంది అందుబాటులో లేరనే కారణంతో ఆచార్య, బ్రహ్మ ఒక్కరే నిర్వహించవచ్చా?, అది వారికి భారం కాదా అని దేవస్థానం వర్గాల నుంచి వ్యాఖ్యలు వినిపిస్తుండటం గమనించదగ్గ విషయం. ఆ కీలక వైదిక సిబ్బంది అందుబాటులో లేకపోతే దేవస్థానంలో సీనియర్‌లుగా ఉన్న వైదిక సిబ్బందితో లేదా విశ్రాంత వైదిక సిబ్బందితో ఆ కార్యక్రమాలు నిర్వహించవచ్చు కదా అని దేవస్థానం ఉద్యోగ వర్గాల నుంచే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

కాగా సోమవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవంలో ఆచార్యులు లేకపోవడం ఒక లోటుగా స్పష్టంగా కనిపించిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ మహోత్సవాలలో అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా బయట వారిని వైదిక సిబ్బందిగా వినియోగించడం పట్ల దేవస్థానం వర్గాల నుంచి ఆక్షేపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానం అధికారులు సైతం ఈ విషయం తెలిసినా మౌనముద్ర వహించడం పట్ల దేవస్థానం వర్గాలే విస్తుపోతున్నాయి.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

» కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పొంగులేటి సమీక్ష



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, మే 12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. సోమవారం భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులపై పైలెట్ మండలాలు నారాయణపేట, ములుగు, కామారెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పైలెట్ ప్రాజె క్టు కింద చేపట్టిన 4 మండలాల్లో రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని మంత్రి అన్నారు.

అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలో 3 వేల 224 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 1,726 సాదా బైనామా ఉన్నాయని, వీటిలో 1,179 స్క్రూటిని చేశామని, వారం 10 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. సాదాబైనామా దరఖాస్తులు కాకుండా వచ్చిన 1,498 దరఖాస్తులలో 581 దరఖాస్తులు పరిశీలించి 146 ఆమోదించి, 435 తిరస్కరించినట్లు తెలిపారు. ఆర్ఎస్సార్ వేరియేషన్ ఉన్న 315 సర్వే నెంబర్ల పరిశీలించిన తర్వాత 112 సర్వే నెంబర్ల సమస్యలను డెస్క్ వర్క్ తో పరిష్కరించామని, మిగిలిన వాటికి క్షేత్ర స్థాయి సర్వే అవసరం ఉందన్నారు. రాబోయే 10 రోజుల్లో సర్వే పూర్తి చేసి భూ సమస్యలు పరిష్కరించే లా చర్యలు తీసుకుంటామన్నారు. 94 అసైన్మెంట్ దరఖాస్తులు వచ్చాయని అన్నారు. సమావేశంలో ఖమ్మం ఆర్డీఓ జి. నరసింహా రావు, ఎస్డీసీ ఎం. రాజేశ్వరి, ల్యాండ్‌సర్వే ఏడి శ్రీనివాసులు, నేలకొండపల్లి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

» ఎస్పీ రోహిత్ రాజ్



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజ్

కొత్తగూడెం, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి నేరస్థులకు శిక్షపడే విధంగా అధికారులు కృషి చేయాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజ్ హెచ్చరించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశాన్ని నర్విహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులు క్వాలిటీ ఆఫ్ ఇన్వేస్టిగేషన్ ద్వారా నేరస్థులకు శిక్షపడే విధంగా చేసిన బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో, వ్యాపార సముదాయాల్లో వాటిని ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పని చేయాలని, మద్యం సేవించి వాహనాలను నడుపుతూ ర్యాస్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, సతీష్‌కుమార్, చంద్రభాను, రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

» పాఠశాలల్లో ఆహ్లాదకరంగా వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు
» వివిధ అంశాలపై శిక్షణలు
» సద్వినియోగం చేసుకుంటున్న చిన్నారులు



యోగా చేస్తున్న విద్యార్థులు

అశ్వారావుపేట రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వేసవి సెలువులు వచ్చాయంటే పిల్లలు అమ్మమ్మ వాళ్ల ఇళ్లకు వెళ్లి సరదాగా గడపటం, అక్కడ ఆనందంగా గడుపుతూ కుటుంబాలు, మనిషి జీవన స్థితిగతుల గురించి తెలుసుకోవడం వంటివి చేసేవారు. ప్రస్తుతం ఆపరిస్థితి లేకుండా పోయింది. ఇప్పుడు సమయం దొరుకుతుందా సెల్‌ఫోన్ చూస్తూ గడిపేద్దామా అనే ధోరణి ఉంది. ప్రస్తుతం ఎక్కువ మంది ఇదే కోవతో ఉన్నారు.

దీంతో పాటు కొంతమంది విద్యార్థులు సరదాగా ఈత అంటూ వాగులు చెరువుల వద్దకు వెళ్లి ప్రాణాలు నిలువునా పోగొట్టుకుంటున్నారు. దీంతో సెలవులు సద్వినియోగం కాకపోగా తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారు. ఈనేపథ్యంలో విద్యాశాఖ విద్యార్థులు వేసవి సెలవులను కొంతమేర అయినా సద్వినియోగం చేసుకునేలా పాఠశాలల్లో ప్రత్యేకంగా వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తుంది. శిబిరాల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణలు, అవగాహన కలిగిస్తున్నారు. తద్వారా చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభ పాటవాలను బయటకు తీస్తున్నారు. ఈనేపథ్యంలో శిబిరాల్లో నేర్పే అంశాలు, విద్యార్థులకు కలుగుతున్న ప్రయోజనాలపై "ఆంధ్రజ్యోతి" ప్రత్యేక కథనం.

విద్యార్థులకు అల్పాహారం

వేసవి శిబిరాలకు వచ్చే విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడకుండా ఉండేలా అల్పాహారాన్ని అందిస్తుంది. ప్రతిరోజూ ఉదయం పదిన్నర తరువాత చిన్నారులకు అల్పాహారం అందిస్తున్నారు. ఉప్మా, పులిహోర, పల్లిలు, గారెలు ఇలా రోజుకు ఒక రకమైన అల్పాహారాన్ని అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు కూడా ఎక్కువ సంఖ్యలో హాజరవుతున్నారు.

నైపుణ్యాల అభివృద్ధే ధ్యేయంగా శిబిరాలు

పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరాలు చిన్నారుల్లో నైపుణ్యాల అభివృద్ధే ధ్యేయంగా సాగుతున్నాయి. అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిరోజూ శిబిరాలను ఆహ్లాదకరంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం యోగా, మెడిటేషన్, ప్రాణాయామం వంటివి చేయిస్తున్నారు. వీటిద్వారా చిన్నారుల్లో ఆరోగ్యంపై కొంతమేర అవగాహన కలిగిస్తున్నారు. తరువాత చదరంగం, క్యారమ్స్, లూడో, వైకుంఠపాళి వంటి ఆటలపై శిక్షణను ఇచ్చి ఆడిస్తున్నారు. చిన్నారులు రెట్టించిన ఉత్సాహంతో పోటీతత్వాన్ని పెంచుకుని శిక్షణ పొందుతున్నారు.

వీటితో పాటు పాఠశాలలో కిచెన్‌గార్డెన్, విత్తన బంతుల తయారీని చేయిస్తూ వ్యవసాయం పట్ల అవగాహన కల్పిస్తున్నారు. నైపుణ్యాలను బయటకు తీసేందుకుగాను చిత్రలేఖనం, కాగితాలతో బొమ్మల తయారీ, ఓరిగామి వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నారు. చిన్నారులు తమ వద్ద ఉన్న కళానైపుణ్యాలు బయటకు తీస్తున్నారు. ప్రతిరోజూ చివరి అరగంటలో ఆర్.కె.నారాయణ రచించిన మాల్గుడి కథలు వినిపించి వాటిపై చర్చ పెడుతున్నారు. దక్షిణ భారతదేశంలోని మాల్గుడి గ్రామం చుట్టూ అల్లుకున్న కథలు, అక్కడి సామాజిక జీవన పరిస్థితులను తెలుసుకుంటున్నారు.

విద్యార్థుల చేత సైన్స్ ప్రయోగాలు చేయించి సైన్స్ పరికరాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఇలా అనేక అంశాలపై నిత్యం చిన్నారులకు అవగాహన కార్యక్రమాలు, శిక్షణను ఉచితంగా అందిస్తున్నారు. చివరి మూడు రోజులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించనున్నారు.

మాల్గుడి కథలు బాగున్నాయి
● నీక్షితా నవీన, 9వ తరగతి



ప్రతిరోజూ మాకు వినిపించే మాల్గుడి కథలు చాలా బాగున్నాయి. మాల్గుడి గ్రామం చుట్టూ అల్లుకున్న ఈకథల గురించి మాతో చెప్పిస్తున్నారు. వీటితో పాటు మొక్కలు పెంచటం, డ్రాయింగ్ వేయటం వంటివి నేర్చుకుంటున్నాము. సెలవులు వృథా కాకుండా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటున్నాయి.

నైపుణ్యాలను అందిస్తున్నాం
● పి.హరిత..హెచ్ఎం, జడ్పీహెచ్ఎస్ అశ్వారావుపేట



విద్యార్థులకు సెలవులిస్తే ఎక్కువగా ఫోన్లతో కాలక్షేపం చేస్తున్నారు. ఇలా కాకుండా శిబిరాల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు పెంచుకోవటం, సైన్స్‌పై అవగాహన, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవడం వంటివి చేస్తున్నాం. చదువుతో పాటు ఇలాంటి నేర్చుకోవటం ద్వారా విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను పెంచుకోవటానికి అవకాశం ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలు శిబిరాలకు వచ్చేలా ప్రోత్సహించాలి.

ఎంతో సరదాగా ఉంటుంది..
పి.హర్ష, 7వ తరగతి



వేసవి శిబిరం ఎంతో సరదాగా ఉంటుంది. ఇంట్లో ఉన్నా స్నేహితులతో గడటమే. కాని ఇక్కడ అనేక అంశాలపై శిక్షణ పొందుతూ సరదగా గడుపుతున్నాం. ప్రతిరోజూ ఆటలు ఆడిస్తున్నారు. షటిల్, క్రికెట్ వంటిని నేర్పిస్తున్నారు. శిక్షణలో మంచి మంచి విషయాలు తెలియజేస్తున్నారు. సెలవులను ఇలా సద్వినియోగం చేసుకోవటం ఆనందంగా ఉంది.



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



కిచెన్‌గార్డెన్‌లో పనులు చేస్తున్న విద్యార్థులు

50 ఉన్నత పాఠశాలల్లో శిక్షణ

వేసవిలో ఎటువంటి నైపుణ్యాలు లేకుండా చిన్నారులు కాలం వెళ్లదీయకూడదనే ఉద్దేశ్యంతో తెలంగాణ విద్యాశాఖ సమగ్రశిక్ష వినూత్నంగా ఆలోచించి 15 రోజులు పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించింది. జిల్లాలో అన్ని కేజీబీవీలతో పాటు ఎంపిక చేసిన 50 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసింది. ఈనెల 5న శిక్షణా శిబిరాలు ప్రారంభమయ్యాయి. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసించే చిన్నారులకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు ప్రత్యేకంగా శిక్షణను ఇస్తున్నారు. ఉపాధ్యాయులు నేర్పే వివిధ అంశాలను నేర్చుకోవటానికి విద్యార్థులు కూడా ఆశించిన మేర వస్తున్నారు.

నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

» నేటినుంచి మూడు విడతల్లో ఐదు రోజుల పాటు శిక్షణ



వసతులను పరిశీలిస్తున్న డీఈవో

కొత్తగూడెం అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2024 గత ఏడాది అక్టోబర్‌లో ప్రభుత్వం నియమించిన నూతన ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈమేరకు మంగళవారం నుంచి మూడు దశల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో యం. వెంకటేశ్వరచారి తెలిపారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో మొత్తం 4,159మంది ఉపాధ్యాయులకు జిల్లాస్థాయిలో హైదరాబాద్‌లో శిక్షణ పొందిన 48మంది రిసోర్స్‌పర్సన్లు శిక్షణను అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో శిక్షణ నిమిత్తం 10 కేంద్రాలు, మండలస్థాయిలో మండల కేంద్రంలో ఒక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ఉపాధ్యాయులకు సూచించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 2015మంది ఎస్ఏ, పీఈటీ, 1974మంది ఎస్‌జీటీ, 60మంది స్పెషల్ ఎడ్యుకేషన్, 110మంది హెచ్‌ఎంలు శిక్షణలో పాల్గొననున్నారు. ఈనెల 13నుంచి మూడు విడతల్లో స్కూల్ అసిస్టెంట్లు, భాష పండితులు, స్పెషల్ ఎడ్యుకేషన్, పీఈటీలకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఖమ్మం జిల్లాలో మొత్తం 5,518మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. జిల్లాలో 2,161మంది ఎస్జీటీలు మండల కేంద్రాల్లో శిక్షణ ఇవ్వనున్నామని డైట్ కాలేజ్ ప్రిన్స్‌పాల్, ఖమ్మం జిల్లా డీఈవో సామినేని సత్యనారాయణ తెలిపారు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. ఉపాధ్యాయులు విద్యాబోధన అందిస్తుండగా, నూతనంగా నియమించిన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఇందులో అత్యధికంగా ఎస్జీటీలు మంది ఉన్నారు. అత్యధికంగా 100నుంచి 120మంది ఉపాధ్యాయులకు ఒక శిక్షణ కేంద్రం ఏర్పాటుచేయనున్నారు.

పలు అంశాలపై శిక్షణ ...

పాఠ్య పుస్తకాల సద్వినియోగం, తరగతి గది నిర్వహణ, విద్య అభ్యసన, ప్రమాణాల పెంపు, పాఠ్య ప్రణాళికలు, మూల్యాంకన పద్ధతులు, విధానాలు, ఐసీటీ, ఐఎఫ్‌టీ, డిజిటల్ విద్యా బోధన, ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐటీ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయడం, తదితర అంశాలపై ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

టెన్నిస్‌లో పాల్వంచ క్రీడాకారుల ప్రతిభ

పాల్వంచ టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): బెజవాడ ఓపెన్ టెన్నిస్‌లో పాల్వంచ టెన్నిస్ క్రీడాకారులు పలు విభాగాల్లో తమ ప్రతిభను చాటి బహుమతులను సాధించారు. సోమవారం పాల్వంచ శ్రీనివాసకాలనీ మినీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను పలువురు అభినందించారు. ఆదివారం బెజవాడలో జరిగిన ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్లో భద్రాద్రి జిల్లా అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ పాల్వంచకు చెందిన క్రీడాకారులు 60ప్లస్ విభాగంలో అన్నం వెంకటేశ్వర్లు టీం, 40 ప్లస్ విభాగంలో భాస్కరరావు, కబీర్‌దాస్‌లు, 30 ప్లస్ విభాగంలో సతీష్, కృష్ణలు రన్నర్స్‌గా నిలిచారు. ఇరు రాష్ట్రాల మధ్య జరిగిన పోటీల్లో పాల్వంచ నుంచి వచ్చిన క్రీడాకారులు గట్టి పోటీని ఇవ్వడం అభినందించదగ్గ విషయమని నిర్వాహకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. విజేతలకు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి అభినందించారు.



బహుమతులతో క్రీడాకారులు

అశ్వారావుపేటలో ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

» సాదాసీదాగా రోడ్డు పక్కన నిలబడి టిఫిన్



టిఫిన్ చేస్తున్న ఎంపీ రాఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట నియోజకవర్గంలో సోమవారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఉదయాన్నే పోలీస్‌స్టేషన్ సెంటర్‌కు వచ్చారు. అక్కడే రోడ్డు పక్కన ఉన్న తోపుడు బండి వద్దకు వెళ్లి టిఫిన్ చేశారు. ఒక దోశ, సింగిల్ ఇడ్లీ తీసుకుని ఓ సామాన్య వ్యక్తిలా రోడ్డు పక్కనే నిలబడి అల్పాహారం తినేశారు. అక్కడ యువతను పలకరించగా అందరూ సెల్ఫీలు దిగారు. అక్కడ ఉన్న వారంతా సింపుల్‌గా ఉండే ఎంపీ అంటూ వ్యాఖ్యనించారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి

అశ్వారావుపేట రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో పేదలకు వైద్యసేవలు అందించే నర్సుల సేవలు వెలకట్టలేనివని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట ఏరియా ఆస్పత్రిలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే హాజరయ్యారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోన కష్టకాలంలో నర్సుల రోజుల తరబడి ఆస్పత్రుల్లోనే సేవలు అందిస్తూ ప్రాణాలను నిలబెట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవల్లో నర్సులే కీలకంగా ఉంటారని అన్నారు. ప్రభుత్వం వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రాధారుక్మిణి, వైద్యులు విజయ్‌కుమార్, నికేశ్, స్టాఫ్‌నర్సు ప్రమీలరాణి, మీరాకుమారి, సుజాత నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై ఫిర్యాదు

అశ్వారావుపేట రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నగూడెం గిరిజన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై సోమవారం గ్రామానికి చెందిన పీసా కమిటీ బాధ్యులు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీలో ప్రభుత్వం నాలుగు ఇళ్లను మాత్రమే మంజూరు చేసింది. అందులోనూ పూర్తిగా గిరిజనేతరులకే ఇళ్లను మంజూరు చేశారు. దీనిపై కొద్దిరోజుల క్రితం గ్రామస్థులు రోడ్డుపై బైటాయించి ఆందోళన కూడా చేశారు. అనర్హులకు ఇళ్లను మంజూరు చేశారని ఆందోళన చేశారు. గిరిజన గ్రామంలో గిరిజనులకు పూర్తిగా అన్యాయం చేశారని పేర్కొంటూ పీసా కమిటీ బాధ్యులైన గ్రామానికి చెందిన మడకం నాగేశ్వరరావు, మరికొంతమంది గ్రామస్థులు ఫౌండేషన్ సహకారంతో జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అర్హులైన గిరిజనులకు ఇళ్లను మంజూరు చేసేలా చూడాలని ఫిర్యాదులో వేడుకున్నట్లు మడకం నాగేశ్వరరావు తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 12(ఆంధ్రజ్యోతి): రైలు నుంచి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఎర్రుపాలెం, గంగినేని రైల్వే స్టేషన్ మధ్యన జరిగింది. మంగళవారం ఉదయం సమయంలో ఎర్రుపాలెం, గంగినేని రైల్వే స్టేషన్ మధ్యన గుర్తు తెలియని వ్యక్తి(45) గల వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడని రైల్వే పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి. రాణాప్రతాప్ తెలిపారు. మృతుడి వద్ద ఖమ్మం నుంచి విజయవాడకు వెళ్లేందుకు జనరల్ టికెట్ ఉందని తెలిపారు. మృతదేహాన్ని ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఖమ్మంలో ఉరేసుకొని విద్యార్థి ...

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 12(ఆంధ్రజ్యోతి): మానసికస్థితి సరిగ్గా లేని ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని పాకబండబజార్‌కు చెందిన యనగందుల శ్యామ్‌కుమార్(21) బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుడికి మానసికస్థితి సరిగా లేకపోవడంతో మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకోని మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

జూదరులపై కేసు నమోదు

కరకగూడెం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్త మసీదు సమీపంలో తంబోలా ఆడుతున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. జూదరులతో పాటు ఐదు ఫోన్లు, ద్విచక్ర వాహనం రూ.15 వందలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ సేవలను విస్తృతం చేయాలి

» కరీంనగర్ జోన్ ఈడీ సాలోమన్



మాట్లాడుతున్న కరీంనగర్ జోన్ ఈడీ సాలోమన్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/ ఇల్లెందుటౌన్, మే12(ఆంధ్రజ్యోతి): వనరులను సద్వినియోగం చేసుకొని డిపో పరిధిలో ప్రజలకు మరింత ఆర్టీసీ సేవలు విస్తృతం చేయాలని కరీంనగర్ జోన్ ఈడీ పి.సాలోమన్ సూచించారు. సోమవారం భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా కొత్తగూడెం ఆర్టీసీ డిపో, ఇల్లెందు డిపోను ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ టీం 20 అనే కార్యక్రమాన్ని డిపో పరిధిలో అవలంభించాలని సూచించారు. ఇల్లెందు డిపో నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు తగిన కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇల్లెందు నుంచి కాళేశ్వరం, ఇల్లెందు నుంచి గుండాల మీదుగా మణుగూరు, హైదరాబాద్‌కు మరికొన్ని సర్వీసులు నడిపేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇల్లెందు డిపో లాభాల బాటలో ఉందని ప్రశంసించారు. డిపో ఆవరణలో పెట్రోల్ బంక్‌కు త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. డిపోలో పని చేస్తున్న డ్రైవర్లు, కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు, మే 12(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లును సోమవారం బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు. బూర్గంపాడు, బుడ్డగూడెం గ్రామాల శివారులోని కిన్నెరసాని వాగు నుంచి అనుమతులు లేకుండా టాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ రాజేష్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో ఇసుకను తరలిస్తున్న మూ డు ట్రాక్టర్లు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత ట్రాక్టర్ల యాజమానులు, డ్రైవర్లుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

15, 16న స్పాట్ కౌన్సెలింగ్

భద్రాచలం, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరానికి విద్యార్థినీ, విద్యార్థులకు స్పాట్ కౌన్సిలింగ్ ప్రవేశం నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ గురరుకుల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం(జేఆర్ ఇంటర్) సీట్ల భర్తీ కోసం స్పాట్ కౌన్సిలింగ్ బాలికలు, బాలురకు వేర్వేరుగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గత విద్యార్థినీ, విద్యార్థులు ఇటీవల పదో తరగతి (2024-25) విద్యాసంవత్సరం పూర్తైన అభ్యర్థులు ధ్రువపత్రాలతో ఈ నెల 15న బాలికలకు, బాలురకు 16న స్పాట్‌కౌన్సిలింగ్ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల (బాలికలు) భద్రాచలం వద్ద అడ్మిషన్ ప్రక్రియకు హాజరు కాగలరని కోరారు. వివరాలకు 9490957271, 9490957270 నెంబర్లను సంప్రదించాలని అన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 12(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌ల అక్రమణపై ఖమ్మం నగర పాలక సంస్థ డీఆర్ఎఫ్ బృందాలు విజృంభించాయి. డీఆర్ఎస్ ఇన్‌చార్జి బెల్లం రాధిక ఆధ్వర్యంలో ఐటీ హాబ్ నుంచి జిల్లా కోర్టు వరకు, ఎన్ఎస్‌పీ కాల్వ నుంచి ఖానాపురం సెంటర్ వరకు, పాత బస్టాండ్ రోడ్డు నుంచి పాత మునిసిపల్ కార్యాలయం వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించారు. ప్రధాన హాస్పిటల్స్, మెడికల్ షాపుల బోర్డులు తొలగించారు. వీధి వ్యాపారుల బండ్లు తొలగించారు. వంద అక్రమణలు తొలగించారు. డీఆర్ఎస్ బలగాలు ఇరుగు శివ, పిట్టల బాబురావు, చెరుకుపల్లి నర్సింహారావు, అక్కినపల్లి నాగేంద్రబాబు, పాపిట్ల రాజేశ్, బండారి వెంకటేష్, భాస్కర్, బండి శివ శంకర్, వై. పరుశురామ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపుపై పోలీసులకు ఫిర్యాదు

వైరా,మే12(ఆంధ్రజ్యోతి):వైరాలోని లయన్స్ కంటి హాస్పిటల్‌ను దెబ్బతీసే విధంగా మీడియా పేరుతో బెదిరిస్తున్న ఒకరిపై హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ ఉంద్రు శ్యాంబాబు సోమవారం వైరా ఎస్ఐ పి.రామారావుకు ఫిర్యాదు చేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ వైరా అనే ఒక స్వచ్ఛంద సంస్థ ద్వారా 25ఏళ్ల నుంచి లయన్స్ ఐకేర్ సెంటర్‌ను ప్రారంభించి ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 40వేలకుపైగా కంటి శస్త్రచికిత్సలు చేశామని, అలాంటి తమ హాస్పిటల్‌పై వైరాతో సంబంధం లేని తల్లాడ మండలానికి చెందిన ఒక వ్యక్తి మీడియా ముసుగులో చెడుప్రచారం చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ బెదిరిస్తున్నాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో శ్యాంబాబు కోరారు.

నగదు అందజేత



నేలకొండపల్లి,మే12(ఆంధ్రజ్యోతి):పాలేరు నియోజకవర్గంలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు పార్టీలకతీతంగా రూ.10వేలు అందిస్తానని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈనేపథ్యంలో నేలకొండపల్లి మండలంలో వారి కుటుంబాలకు సోమవారం అందించారు. నేలకొండపల్లికి చెందిన ముగ్గురికి, చెర్వుమాధారం, నాచేపల్లి, కొత్తకొత్తూరు,రామచంద్రాపురం,కొరట్లగూడెం గ్రామాల్లో ఒక్కొక్కరికి, బోదులబండ, కోనాయగూడెం గ్రామాల్లో ఇద్దరికి కొడాలి గోవిందరావు,జిల్లా నాయకుడు నెల్లూరి భద్రయ్య అందచేశారు. కార్యక్రమంలో బొడ్డు బొందయ్య, వేగినాటి లక్ష్మీనర్సయ్య, కుక్కల హనుమంతరావు, రాయపూడి నవీన్,లక్కం ఏడుకొండలు,బచ్చలకూరినాగరాజు,మామిడి వెంకన్న, షేక్.ఖాజామియా, కట్టికోల నాగార్జున పాల్గొన్నారు.

ఆశతో వచ్చి.. అర్జీలు సమర్పించి

ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, హాజరైన జిల్లా అధికారులు

ఖమ్మంకలెక్టరేట్,మే12(ఆంధ్రజ్యోతి): తమకు ఎదురవుతున్న సమస్యలు, జరిగిన అన్యాయాలను గుర్తించి వాటికి పరిష్కారం చూపుతూ మీరే న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. దివ్యాంగులు, వితంతువుల పింఛన్లు, భూ సమస్యల పరిష్కారానికి అధికారులను వేడుకున్నారు. వివిధ శాఖలకు సంబంధించిన 50దరఖాస్తులు రాగా వాటిని పరిష్కరించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కారించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఈ ప్రజావాణిలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీవో ఎన్. సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ, డీఎంహెచ్‌వో బి.కళావతి బాయి, డీడీ సత్యనారాయణ, జ్యోతి, మిషన్‌భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదులు ఇలా :

● నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన జయమ్మ ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో ముందు తన పేరు వచ్చిందని, తర్వాత తొలగించారని తనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరింది.

● నాగులవంచ రెవెన్యూ గ్రామానికి చెందిన జి.రాములు నాగులవంచ చొప్పకట్లపాలెం రోడ్డు 4అడుగుల ఎత్తులో వేస్తున్నారని, దీనివల్ల తన భూమితో పాటు 100 ఎకరాలకు పైగా పంట నష్టం జరుగుతుందని వివరించాడు. పంట పొలాలు వర్షపు నీరుకు మునిగిపోకుండా తూములు వేయాలని విన్నవించాడు.

● ఏన్కూర్ మండలం కేసుపల్లి గ్రామానికి చెందిన రామారావు తాను దివ్యాంగ నిరుపేదనని ఎంఏ, బీఈడీ పూర్తి చేశానని, ఉపాధి కల్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు స్పందించాలని విన్నవించాడు.

వరద నివారణ చర్యలపై ముందస్తు సమీక్ష

ఖమ్మంరూరల్, మే12 (ఆంధ్రజ్యోతి) రానున్న వర్షాకాలం నేపథ్యంలో వరద నివారణకు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ రాంప్రసాద్ మాట్లాడుతూ శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై వారం రోజుల్లో కార్యచరణ వివరాలను కలెక్టర్‌కు పంపించాలని చెప్పారు. వర్షాల సమయంలో పాతభవనాలతో ప్రమాదాలు ఏర్పడకుండా కూల్చివేయాలన్నారు. గతసెప్టెంబర్‌లో మున్నేరు పరివాహక ప్రాంతంలో వరదల కాలంలో అపార నష్టం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వాతావరణ పరిస్థితులను ముందస్తుగా స్థానికులకు తెలియచేయలన్నారు. గ్రామాలలో, మున్సిపాలిటి పరిదిలో వార్డుల వారీగా టీంలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్, ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

'నర్సుల సేవలు వెలకట్టలేనివి'



ఆస్పత్రిలో నర్సులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తదితరులు

ఖమ్మంకలెక్టరేట్,మే12(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడే వారికి నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని జిల్లా జనరల్ ఆస్పత్రి ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు అన్నారు. సోమవారం నర్సుల దినోత్సవం సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో కరోనా, ఇతర క్లిష్ట సమయంలో ప్రాణాలకు లెక్కచేయకుండా వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. జిల్లాలో పనిచేసిన నర్సింగ్ సిబ్బంది వైద్యుల సేవలతో రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చిందన్నారు. నైటింగేల్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంవో బి రాంబాబు, వినాయక్ రాథోడ్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్1 శాంతకుమారి,గ్రేడ్2 ఇందిరమ్మ, రత్నకుమారి, జి.లక్ష్మీ, కె.ఇమేలియా మేరి, పి.మల్లీశ్వరి పాల్గొన్నారు.

బడిబాటపై ఇంటింటి కార్యక్రమం

తిరుమలాయపాలెం, మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలులో బడిబాట కార్యక్రమంపై ఇంటింటి కార్యక్రమం చేపట్టారు. హెచ్‌ఎం ఎంపీఎన్ జ్యోతి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలతోపాటు ఉచిత భోజనం, దుస్తులు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తులసి, సీఆర్పీపప్పుల స్పందన పాల్గొన్నారు.

భావనకు నివాళి

తల్లాడ, మే12(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన బీటెక్ విద్యార్థిని అయిలూరి భావనకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ నివాళులర్పించారు. సోమవారం తల్లాడ మండలం కుర్నవల్లిలో భావన కుటుంబసభ్యులను పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బ్లాక్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, అయిలూరి వెంకటకోటారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులపాలు చేసింది

- ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు కొనసాగిస్తాం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న పొంగులేటి

తిరుమలాయపాలెం, మే12(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలుజేసిందని వాటిని అధిగమించి ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తిమ్మక్కపేట, ఎర్రగడ్డ, మేడిదపల్లి తదితర గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాన చేశారు. గోపాయిగూడెంలో రూ.13లక్షలతో చేపడుతున్న పాఠశాల అదనపు గదులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఈనెల చివరి నాటికి అర్హులకు రేషన్‌కార్డులు అందిస్తామని పేర్కొన్నారు. గోపాయిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థచైర్మన్ రాయల నాగేశ్వరావు, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర మహిళ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దినేని బేబి స్వర్ణకుమారి, జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి ఆత్మకమిటీ చైర్మన్‌చావా శివరామకృష్ణ,జేడీఏ పుల్లయ్య, ఆర్డీవో నరసింహారావు, ఏడీఏ సరిత, తహసీల్దార్ జి.సుధీర్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఏవోసీతారాంరెడ్డి, మాజీజడ్పీటీసీ బెల్లం శ్రీను, మాజీఎంపీపీ మంగిలాల్,యన్నం సుధాకర్‌రెడ్డి, ఆర్.వెంకటరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు నాగేశ్వరరావు, జడల నగేష్ పాల్గొన్నారు. మండల కేంద్రంలో పబ్లిక్‌టాయిలెట్, ఐటీఐ కళాశాల, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

మసీదులను అభివృద్ధి చేసుకోవాలి

ఖమ్మంరూరల్: మసీదుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని 18మసీదులకు రూ.18లక్షల చెక్కులను మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి పొంగులేటి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చేతులమీదుగా ముస్లింలకు అందజేశారు. నియోజకవర్గంలోని మిగతా మండలాల మసీదులకు త్వరలో నిధులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి. పురంధర్, మైనార్టీకార్యాలయ సిబ్బంది మహమ్మద్ యాకూబ్ పాషా, షేక్ సైదుల, జిల్లా నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, బండి జగదీష్ పాల్గొన్నారు.

పంట మార్పిడితో సుస్థిర ఆదాయం

- ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్
- రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం



ప్రసంగిస్తున్న కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్

వైరా,మే12(ఆంధ్రజ్యోతి): రైతులు పంటమార్పిడి విధానాన్ని పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. మండలంలోని ఖానాపురం గ్రామంలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, కేవీకే కోఆర్డినేటర్ కె.రవికుమార్ మాట్లాడుతూ.. తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించాలని, అవసరం మేరకు రసాయనాలను వినియోగించాలని, నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. అలాగే సాగునీటిని ఆదా చేసి భావితరాలకు అందించాలని, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని, పంట మార్పిడి పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాస్త్రవేత్త పీఎస్ఎం.వణిశ్రీ, జిల్లా రైతు సంఘం నాయకుడు నలమల వెంకటేశ్వరరావు, తల్లాడ పశువైద్యాధికారి అనాస్, విత్తనాభివృద్ధి సంస్థ అధికారిణి అక్షిత, వైరా ఏవో మయాన్ మంజూఖాన్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు లాల్‌మహ్మద్, మధ్యతెలంగాణ మండలి పరిశోధన, విత్తన సలహా సంఘం సభ్యుడు తుమ్మల రాణాప్రతాప్, ఏఈవోలు సైదులు, వాసంతి, కీర్తి, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో రంగు మారిన తాగునీరు



ఖమ్మంసంక్షేమవిభాగం, మే12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 24వ డివిజన్‌లో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు రంగుమారి సరఫరా జరిగాయి. తాగేందుకు నీళ్ల పట్టుకున్న ప్రజలు నీళ్ల రంగు చూసి అవాక్కయ్యారు.మంచినీటి ట్యాంకు నిర్వాహణ లేదా వాటర్ సప్లయ్ పైపుల కనెక్షన్ నిర్వాహణ లోపంతోనే ఇలా రంగు మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఈ నీళ్ల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గామారాయి. ఈవిషయంపై కేఎంసీ పబ్లిక్ హెల్త్ అధికారులు ఎటువంటి వివరణ ఇవ్వలేదు.

కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌వో కళావతీబాయి



మాట్లాడుతున్న కళావతీబాయి

ఖమ్మంకలెక్టరేట్,మే12(ఆంధ్రజ్యోతి):నియంత్రణపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.కళావతీబాయి అన్నారు. పిల్లలకు పిల్లలకు మధ్య ఎడాన్ని పాటించేలా పూర్తి అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. సోమవారం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు,పీపీయూనిట్స్, ఏరియా హాస్పటల్స్, జిల్లా వైద్యఆరోగ్య శాఖా సెంట్రల్ స్టోర్స్ ఫార్మసీ ఆఫీసర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీలు, ఆరోగ్య కేంద్రాల్లో ఆన్‌లైన్ ఎఫ్.పీ.ఎల్.ఎం.ఐ.ఎస్. పోర్టల్ ద్వారా కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతులలో వాడుతున్న కమోడిటీస్ - ఐయూడీలు, ఓరల్ పిల్స్ (నోటి మాత్రలు), కండోమ్‌లు, అంతరా ఇంజెక్షన్ల స్టాకు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. అర్హులైన దంపతులకు ఫ్యామిలీ ప్లానింగ్ తాత్కాలిక పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లకు పిల్లకుమధ్య ఎడం పాటించేలా దంపతులకు అవగాహన కల్పించి మంచి ఫలితాలనుసాధించాలన్నారు. ఈకార్యక్రమంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్, డెమో సుబ్రహ్మణ్యం, ఫార్మసీ సీనియర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఘనంగా కార్పొరేటర్ పెళ్లి రోజు వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ గజ్జెల లక్ష్మీ, వెంకన్న దంపతులు

ఖమ్మంసంక్షేమవిభాగం,మే12(ఆంధ్రజ్యోతి): నగరంలోని 28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ, వెంకన్న దంపతుల పెళ్లిరోజు వేడుకలు డివిజన్ ప్రజలు, అభిమానుల మధ్య ఉత్సాహంగా జరిగాయి. అంకాల వీరభద్రం, ఎస్సీ సెల్, మైనార్టీ సెల్, పెట్రోల్ బంకు అసోసియేషన్, సుతారి మేస్త్రీలు అసోషియేషన్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పలు కూడల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నిర్వహించిన వేడుకల్లో లక్ష్మీ వెంకన్న దంపతులు కేక్ కట్ చేశారు. కార్యకర్తలతో వారు సంతోషం పంచుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మానకొండ ఉపేందర్, జహీర్‌బాయ్, ఖాదర్, ముత్యాల మేస్త్రీ, బండి నవీన్, కిషోర్, సలీమ్, హుసేన్, విద్యాసాగర్, మేకల శ్రీను, బోడ్డు శ్రీను, బోడ్డు వెంకటరత్నం, వెంకన్న, సుంకర సతీష్, అంకాల వీరభద్రం, ఉప్పిరెడ్డి, జావిశెట్టి నాగేశ్వరరావు, గాజుల వెంకటేష్, గంటాల సంతోష్, ఏపూరి కృష్ణ, గంగరబోయిన రవి వేడుకల్లో పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినికి ఆర్థికసాయం

వైరా, మే 12 (ఆంధ్రజ్యోతి): వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండలం చెరువుమాదారానికి చెందిన కల్లూరు కావ్య నర్సింగ్ మూడోసంవత్సరం చదువుతోంది. నిరుపేద అయిన కావ్యకు రూ.పదివేల ఆర్థిక సహాయాన్ని డాక్టర్ కాపా మురళీకృష్ణ అందజేశారు. సోమవారం కొల్లా రాంబాబు, నాగమణి దంపతులు అలాగే చింతోజు నాగేశ్వరరావు, సీత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కావ్యకు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో లగడపాటి ప్రభాకర్‌రావు, ఉంద్రు శ్యాంబాబు, పి.ఉపేంద్రరావు, వై.బుచ్చిరామారావు, వజినేపల్లి చక్రవర్తి, డాక్టర్ డి.కోటయ్య రమేష్ పాల్గొన్నారు.

వందరోజులు.. భవిష్యత్ కార్యాచరణ

- కేఎంసీ, మెప్మా అధికారులు, ఉద్యోగులతో ఏఎంసీ సమావేశం



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షపీ ఉల్లా

ఖమ్మంసంక్షేమవిభాగం,మే12(ఆంధ్రజ్యోతి): రాబోయే వంద రోజుల్లో ఖమ్మం నగర పాలక సంస్థలో చేపట్టబోయే ముఖ్యమైన పనులు, పారిశుధ్యం, ఇతర అంశాలపై అధికారులు కార్యాచరణ రూపొందించారు. సోమవారం కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షపి ఉల్లా (ఏఎంసీ)ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పారిశుధ్య విభాగం ఉద్యోగులు, మెప్మా అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. వంద రోజులు భవిష్యత్ కార్యచరణపై మార్గదర్శకాలను వివరించారు.కూడళ్ల అభివృద్ధి కోసం ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని అవసరమైన కూడల్లో అదనపు నిర్మాణాలు చేపట్టటం, తాగునీటి సమస్యపై పబ్లిక్ హెల్త్, వాటర్ సప్లయ్ విభాగాలతో సమన్వయం చేసుకొని ముందకు వెళ్లటం, నూతన టెండర్లు పిలిచి పనులు వంద రోజుల్లో పూర్తి జరిగేలా చూడటం. వర్షాకాలం లోపుగానే నర్సరీలను మొక్కలు పెంచటం, అవసరమైన నూతన నర్సరీలను నిర్మాణం చేయటంపై కార్యచరణ చేశారు.

భువన్ సర్వేతో ముడింపు

ఎప్పటికప్పుడు ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్‌తో పాటుగా భువన్ సర్వేతో ప్రాపర్టీల లెక్కలు గణించాలని ఆదేశించారు. ఈ మేరకు వార్డు ఆఫీసర్లకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించారు. అమృత్ పథకం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలతో వాటర్‌కుళాయిలు నిర్మాణం చేయించటం, మరమ్మతులకు గురైన వాటిని తిరిగి ఏర్పాటు చేయటం, బిల్లులు వసూళ్ల చేయటంపై కార్యచరణ జరిగింది. ఖమ్మం నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉన్నత వైద్యసేవలు అందించటం. ఇంటింటి తడి, పొడి చెత్తపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారోత్సవాలు, పక్షోత్సవాలు కార్యాచరణ చేసి ప్రజలకు అవగాహన పెంపొందించటం చేయనున్నారు.

మెప్మా ఆధ్వర్యంలో..

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అవసరమైన ప్రాంతాల్లో వీధి వ్యాపారుల కమిటీలను ఏర్పాటు చేయటం. వీధి వ్యాపారులను గ్రీన్‌జోన్, రెడ్‌జోన్, అంబర్ జోన్‌లుగా విభజన చేసి ఆ మేరకు కేఎంసీ అధికారులతో సమన్వయం చేయాలని నిర్ణయించారు. కొత్త మహిళా సంఘాలు ఏర్పాటు లక్ష్యాలను వంద రోజుల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఖమ్మం నగరంలో రూ.10కోట్ల మేరకు ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకు లింకేజీలు ఇవ్వాలని నిర్ణయించారు. మహిళా శక్తి క్యాంటీన్లు డిమాండ్ మేరకు ఏర్పాటు చేయటం. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాక దివ్యాంగులు, ఇతర అవసరాలు కలిగిన వారికి సదరమ్ ధ్రువపత్రాలకు సహకరించటం, అమృత్‌మిత్ర పథకం ద్వారా మహిళా సంఘాలను చైతన్యం చేసి ఖమ్మం నగరంలో తాగునీటి ఎద్దడి రాకుండా మిషన్ భగీరథ, ఇతర మంచినీటి ట్యాంకు నీళ్ల సప్లయ్ జరిగేలా చూడటంపై వంటి పనులను వంద రోజులు కార్యచరణ చేశారు.

సిరిపురం సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మధిరరూరల్, మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం సబ్‌స్టేషన్‌లో సోమవారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు.విద్యుత్‌శాఖ ఖమ్మం ఎస్ఈ శ్రీనివాసచారి ప్రారంభించారు. రైతులు వేసవిలో వ్యవసాయ అవసరాలకు గరిష్ట స్థాయిలో విద్యుత్ వాడుతుండడంతో అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ అందించే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న 3.15 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో రూ.53లక్షలతో 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఖమ్మం సర్కిల్‌లో అధిక విద్యుత్‌లోడ్ పెరిగిన సబ్‌స్టేషన్ల నందు అధిక లోడు కలిగిన నూతన ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ డీఈ బండి శ్రీనివాసరావు, ఎంఆర్‌టీడీఈ బద్రు, మధిర సబ్‌డివిజన్ ఏడీఈఎం.అనురాధ,ట్రాన్స్‌ఫారమ్స్ ఏడీఈ రాందాస్, మధిర రూరల్ సెక్షన్ ఏఈ ఎస్.మైథిలి, గౌస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్

తల్లాడ: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కోసం నిరంతరం కృషి జరుగుతుందని విద్యుత్‌శాఖ ఖమ్మం ఎస్ఈ ఇ.శ్రీనివాసాచారి అన్నారు. సోమవారం తల్లాడలో నూతనంగా ఏర్పాటుచేసిన 100కేవీ ట్రాన్స్‌ఫార్మాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రంమలో సత్తుపల్లి డీఈ ఎల్.రాములు,బద్రు, ఏడీఈ నెల్లూరి సతీష్, ఏఈ రాయల ప్రసాద్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగించుకోవాలి

ఏన్కూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఏన్కూరు బాలుర గురుకుల విద్యాలయంలో ఈ నెల 10నుంచి సమ్మర్ క్యాంపు శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపు శిక్షణ తరగతులు ఈనెల 26వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6వతరగతి నుంచి 9వతరగతి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్స్ క్రాఫ్ట్, యోగ శిక్షణ తరగతులు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల సద్వినియోగించుకోవాలని, వివరాలకు 9701222080 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సహించేదిలేదు

పెనుబల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో తనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని కోట్లాదిరూపాయలతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిపై కాంగ్రెస్ నాయకుడిగా పార్టీలో ఉంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న నున్నా రామకృష్ణను ఇలాగే ప్రవర్తిస్తే సస్పెండ్ చేయిస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని రంగారావుబంజర్‌లోని సోమరాజు సీతారామారావు ఇంటి వద్ద జరిగిన కార్యకర్తల సమావేశంలో పలువురు నాయకులు ఆయన వ్యాఖ్యలను ఖండించారు. లంకపల్లి గ్రామంలో అభివృద్ధి జరగలేదని చెప్పటం సబబు కాదని, గ్రామంలో రూ.మూడుకోట్లతో సీసీ రోడ్లు, గుర్రాయిగూడెం నుంచి కిష్టారంకు రూ.రెండున్నర కోట్లతో బీటీ రోడ్డు, పాఠశాల అభివృద్ధికి లక్షలాదిరూపాయలు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టిన సంగతి తెలుసుకోవాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, సోమరాజు సీతారామారావు, చీకటి రామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, మేకతొట్టి కాంతయ్య, నవజీవన్ బాబు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పంట మార్పిడితో సుస్థిర ఆదాయం



సమావేశంలో ప్రసంగిస్తున్న నలమల వెంకటేశ్వరరావు

వైరా, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటమార్పిడి విధానాన్ని పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. మండలంలోని ఖానాపురం గ్రామంలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, కేవీకే కోఆర్డినేటర్ కె.రవికుమార్ మాట్లాడుతూ.. తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించాలని, అవసరం మేరకు రసాయనాలను వినియోగించాలని, నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. అలాగే సాగునీటిని ఆదా చేసి భావితరాలకు అందించాలని, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని, పంట మార్పిడి పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాస్త్రవేత్త పీఎస్ ఎం.పణిశ్రీ, జిల్లా రైతు సంఘం నాయకుడు నలమల వెంకటేశ్వరరావు, తల్లాడ పశువైద్యాధికారి అనాస్, విత్తనాభివృద్ధి సంస్థ అధికారిణి అక్షిత, వైరా ఏవో మంజూఖాన్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు లాల్‌మహ్మద్, మధ్య తెలంగాణ మండలి పరిశోధన, విత్తన సలహాసంఘం సభ్యుడు తుమ్మల రాణాప్రతాప్, ఏఈవోలు సైదులు, వాసంతి, కీర్తి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

భావనకు నివాళి

తల్లాడ, మే 12 (ఆంధ్రజ్యోతి) ఆత్మహత్యకు పాల్పడిన బీటెక్ విద్యార్థిని అయిలూరి భావనకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ నివాళులర్పించారు. సోమవారం తల్లాడ మండలం కుర్నవల్లిలో భావన కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా భావన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, నాయకులు అయిలూరి వెంకటకోటారెడ్డి(బాబు), అన్నెం కోటిరెడ్డి, గోవిందు శ్రీనివాసరావు, గంటల వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

వైరా, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో సోమవారం సన్‌రైజ్ అభ్యుదయ సేవసమితి ఆధ్వర్యంలో వృద్ధులకు రూ.20వేల విలువైన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఏనుగు కిషోర్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన సోదరుడు సుమన్‌బాబు ఈ నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్ర ఎంపీ.దాస్, శివరాఘవ, సుబానీ, కిరణ్‌బాబు, కిలారు శ్రీనివాసరావు, వెంపటి శ్రీనివాసరావు, ఉపేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



శివనాథ్‌కు స్వాగతం పలుకుతున్న కల్లూరు టీడీపీ నాయకులు

తెలంగాణలో టీడీపీ ప్రభంజనం సృష్టిస్తుంది

కల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రానున్న కాలంలో టీడీపీ ప్రభంజనం సృష్టిస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు బైపాస్ రహదారి మీదగా వెళ్తుండగా కల్లూరు మండల టీడీపీ నాయకులు ఆయనకు ఎదురేగి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీని అధికంగా ఆదరించిన ప్రాంతం తెలంగాణ అని చెప్పారు. ఈ ప్రాంతంలో తెలుగుదేశం పార్టీని మరింతగా బలోపేతం చేసేలా ఇక్కడి నాయకులకు తమ వంతుగా సహకరిస్తామని అన్నారు. కల్లూరు ప్రాంతానికి తొలిసారిగా విచ్చేసిన ఎంపీ శివనాథ్‌కు టీడీపీ జిల్లా నాయకులు కాకర్ల రంగారావు, జాస్తి శ్రీనువాసరావు, మండల నాయకులు పోట్రు శ్రీనువాసరావు, దూపాకుంట్ల మురళి, అబ్బూరి శ్రీనువాసరావులు శాలువలతో సత్కరించి ఆయనకు స్వాగతం పలికారు.

వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

ముదిగొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): యూఎస్, యూకేతో భారత ప్రభుత్వం చేస్తున్న వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలు రైతాంగానికి తీవ్రంగా నష్టం కలిగిస్తాయని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ముదిగొండ మండలం పెద్దమండవ గ్రామంలో జరిగిన గ్రామ రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలు, స్వేచ్ఛ వాణిజ్య విధానాల వల్ల భారతదేశ వ్యవసాయ రంగం ఒత్తిళ్లకు గురై రైతులకు గిట్టుబాటు ధరలు రావడం లేదన్నారు. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ భారత వ్యవసాయ ఉత్పత్తులను పూర్తిస్థాయిలో తమ ఆధీనంలోకి తీసుకునే విధంగా వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలకు ప్రయత్నం చేస్తున్న సమయంలో భారత ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోతే దేశంలో సాగురైతులు, వ్యవసాయం మరింత సంక్షోభంలోకి పోతుందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం యుకేతో ఇదివరకుఏ చేసుకున్న వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మంజిల్లాలో సాగునీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టు కెనాల్‌ను పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేయడం కోసం అవసరమైన నిధులను జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు బాధ్యత తీసుకుని విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని, జిల్లాలో అకాల వర్షాలతో ధాన్యం రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మడుపల్లి గోపాలరావు, రాయబారపు కల్యాణ్, పురుషోత్తం, యర్రపల్లి రవికుమార్, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



సీఐ రమేష్

మధిరరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదని కఠిన చర్యలు తీసుకుంటామని మధిరటౌన్ సీఐ రమేష్ అన్నారు. సోమవారం మధిర టౌన్ పోలీసుస్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక అక్రమరవాణ, గంజాయి, ఈవ్ టీజింగ్‌పై నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



ప్రజావాణికార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కారేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారికి సత్వరమే మేలు జరిగిలేలా చూస్తామని తహశీల్దార్ సంపత్‌కుమార్ అన్నారు. కార్యలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు వారి సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను శాఖలవారిగా వేరుచేసి పంపారు. వచ్చే సోమవారంలోపు దరఖాస్తుల్లోని సమస్యలకు పరిష్కారం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రవీంద్రప్రసాద్, డిటి కృష్ణయ్య తో పాటు పలుశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు టీచర్లకు వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పారుపల్లి నాగేశ్వరరావు

మధిరరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రాంతీయ కార్యాలయం నందు సోమవారం టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్తల సమావేశ ం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 2008 డీఎస్సీ ద్వారా కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా నియామకం పొందిన వారికి నాలుగు నెలలు అయినా వేతనం అందకపోవడం వల్ల కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వారికి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2024 డీఎస్సీ ఉపాధ్యాయులు అక్టోబరు 10వతేదీన విధులలో చేరారని, నియామక ఉత్తర్వులు ఇచ్చినప్పటికి వేతనాలు చెల్లించకపోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి షేక్‌నాగుర్‌వలీ, ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్ ఏ.వినోద్‌రావు, మధిర మండల అధ్యక్ష, కార్యదర్శులు బండారు నాగరాజు, ఇర్రి వీరయ్య, ఉపాధ్యక్షుడు షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల రద్దును ఉపసంహరించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులు

మధిరటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనేక ఏళ్లుగా ఉన్న కార్మిక చట్టాల రద్దును ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘ నాయకులు కోరారు. సోమవారం మధిరలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, సిఐటియు నాయకులు సమావేశమై కార్మిక చట్టాల రద్దుకు నిరసనగా ఈ నెల 20 వ తేది నుంచి అన్ని సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చారు. సమ్మె విజయవంతం అయ్యేందుకు రాజకీయ పార్టీలు కూడ కలసి రావాలని కోరారు. ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, సిఐటియు నాయకులు చంటి, వెంకటేశ్వరరావు, శీలం నరసింహారావు కాంగ్రెస్ నాయకులు సూరంశెట్టి కిషోర్, సిపిఐ నాయకులు రవి, సిపిఎం నాయకులు రామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ముదిగొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20వతేదీన దేశవ్యాప్తంగా జరుగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దేనోజు లక్ష్మయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మేడికొండ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ముదిగొండలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నారోజు ఈశ్వరాచారి, చెట్టబోయిన వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు నారోజు బ్రహ్మచారి, అంథోని రాజు, అబ్దుల్, గణేష్, పాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

బెదిరింపులపై పోలీసులకు ఫిర్యాదు



ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న శ్యాంబాబు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

వైరా, మే 12 (ఆంధ్రజ్యోతి): వైరాలోని లయన్స్ కంటి హాస్పిటల్ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా మీడియా పేరుతో బెదిరిస్తున్న ఒకరిపై హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ ఉండ్రు శ్యాంబాబు సోమవారం వైరా ఎస్ఐ పి.రామారావుకు ఫిర్యాదు చేశారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు సమర్పించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ వైరా అనే ఒక స్వచ్ఛంద సంస్థ ద్వారా 25సంవత్సరాల నుంచి లయన్స్ ఐకేర్ సెంటర్‌ను ప్రారంభించి మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించి ఇప్పటివరకు 40వేలకుపైగా కంటి శస్త్రచికిత్సలు చేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలతోపాటు ఏపీలోని అనేక ప్రాంతాల నుంచి వేలమంది నిరంతరం వైద్యసేవలు పొందుతున్నారని తెలిపారు. అలాంటి తమ హాస్పిటల్‌పై వైరాతో సంబంధం లేని తల్లాడ మండలానికి చెందిన ఒక వ్యక్తి మీడియా ముసుగులో చెడుప్రచారం చేస్తూ బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతూ బెదిరిస్తున్నాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో శ్యాంబాబు కోరారు.

ఆశతో వచ్చి.. ఆర్జీలు సమర్పించి

» ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్



ఫిర్యాదులు అందుకుంటున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): తమకు ఎదురవుతున్న సమస్యలు, జరిగిన అన్యాయాలను గుర్తించి వాటికి పరిష్కారం చూపుతూ మీరే న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. దివ్యాంగులు, వితంతువుల పింఛన్లు, భూ సమస్యల పరిష్కారం కోసం అధికారులను వేడుకున్నారు. వివిధ శాఖలకు సంబంధించిన 50 దరఖాస్తులు రాగా వాటిని పరిష్కరించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఈ ప్రజావాణిలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీవో ఎన్. సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ, డీఎంహెచ్‌వో డాక్టర్ బి కళావతిబాయి, డీడీ సత్యనారాయణ, జ్యోతి, మిషన్‌భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదులు ఇలా:

నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన జయమ్మ ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో ముందు తన పేరు వచ్చిందని, తర్వాత తొలగించారని తనకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరింది.

నాగులవంచ రెవెన్యూ గ్రామానికి చెందిన జి. రాములు తనకు సర్వే నెంబర్ 279అ/1/1లో ఎకరం 10 గుంటల భూమి ఉందని, నాగులవంచ చొప్పకట్లపాలెం రోడ్డు 4 అడుగుల ఎత్తులో వేస్తున్నారని, దీనివల్ల తన భూమితో పాటు 100 ఎకరాలకు పైగా పంట నష్టం జరుగుతుందని, పంట పొలాలు వర్షపు నీరుకు మునిగిపోకుండా తూములు వేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు.

ఏన్కూర్ మండలం కేసుపల్లి గ్రామానికి చెందిన రామారావు తాను దివ్యాంగ నిరుపేదనని ఎంఏ, బీఈడి పూర్తి చేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు.

కల్లూరు వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రుక్మిణి

కల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): కల్లూరుకు చెందిన నేషనల్ ఉమెన్స్ వింగ్ ప్రసిడెంట్ ఎనుముల రుక్మిణి యాదవ్‌కి సౌత్ ఆఫ్రికా, గుడ్ సమరిటన్ గోబ్లుల్ ఫీస్ ఆకాడామి వారు డాక్టరేట్ అందించారు. మాతృ దినోత్సవం సందర్భంగా విజయవాడలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో రుక్మిణి యాదవ్ డాక్టరేట్ అందుకున్నారు. హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ పరంగా రుక్మిణి సేవలకు గానూ నంది అవార్డు, ఝాన్సీ లక్ష్మీబాయి, మదర్‌థెరిసా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వంటి అవార్డులను అందుకున్నారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్‌లో నేషనల్ ప్రసిడెంట్ డాక్టర్ బొడ్డుపాటి దాసు సహకారంతో ఇలా అనేక విధాలుగా సేవలందిస్తూ ముందుకు సాగుతున్నట్లు రుక్మిణి యాదవ్ చెప్పారు. తనకు డాక్టరేట్ ప్రదానం చేయటం కల్లూరు ప్రాంతానికి గర్వకారణమని, బాధ్యతను మరింతగా పెంచిందని అన్నారు.

అడవులను ఎకోటూరిజంగా అభివృద్ధి చేయాలి

సత్తుపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాను ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అటవీ ప్రాంతాన్ని టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రంలో అడవులు అంతరించి పోయిన కారణంగానే వాతావరణ సమతుల్యత దెబ్బతిని కాలాలు మారిపోతున్నాయని అన్నారు. అడవులను సంరక్షించుకుంటూనే ధ్వంసమైన అటవీ ప్రాంతాల్లో తిరిగి మొక్కలు పెంచాల్సి ఉందన్నారు. వీఎస్ఎస్ సభ్యులకు అటవీ ఉత్పత్తులు ఉచితంగా సేకరించుకునే వీలు కల్పించి వాటి ద్వారా ఇస్తరాకులు, ఆకులతో కప్పులు తయారు చేసే మిషన్లు కూడా అందించటం హర్షణీయమని అన్నారు. ఫుడ్‌ప్రాసెస్‌యూనిట్లు పంపిణీ మంచి పరిణామమని చెప్పారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ.. పెనుబల్లి మండలంలోని నీలాద్రి వద్ద పార్కును అభివృద్ధి చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కనకగిరి ఎకో టూరిజం కోసం రూ.12కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు. సత్తుపల్లిలో పార్కులో సందర్శకులు, వాకర్స్‌కు ప్రవేశరుసుం ఎక్కువగా ఉందని స్థానికులు చెపుతున్నారని, తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వీఎస్ఎస్ సభ్యులకు ఇస్తున్న తక్కువ బడ్జెట్‌లో మిషన్లు డ్వాక్రా మహిళలకు కూడా అందజేయటం ద్వారా వారు ఆర్థికంగా స్థిరపడతారని అన్నారు. దీనికి ఎంపీ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీవో మంజుల, ఆషా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ దయానంద్, సింగరేణి పీవోలు ప్రహ్లాద్, నరసింహారావులు పాల్గొన్నారు.

సిరిపురం సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మధిరరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం సబ్‌స్టేషన్‌లో సోమవారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. విద్యుత్‌శాఖ ఖమ్మం ఎస్ఈ శ్రీనివాసచారి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వేసవిలో వ్యవసాయ అవసరాలకు గరిష్ట స్థాయిలో విద్యుత్ వాడుతుండడంతో అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ అందించే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న 3.15 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 53లక్షల రూపాయలతో 5ఎంవీఏ పవర్ ట్రాన్సుఫార్మర్‌ను ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. ఖమ్మం సర్కిల్‌లో అధిక విద్యుత్‌లోడ్ పెరిగిన సబ్‌స్టేషన్ల నందు అధిక లోడు కలిగిన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ డీఈ బండి శ్రీనివాసరావు, ఎంఆర్‌టీడీఈ బద్రు, మధిర సబ్‌డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ, ట్రాన్స్‌ఫారమ్స్ ఏడీఈ రాందాస్, మధిర రూరల్ సెక్షన్ ఏఈ ఎస్.షైథిలి రూరల్ సెక్షన్ విద్యుత్‌శాఖ సిబ్బంది గౌస్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, నాగరాజు, బాబుసాహెబ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సిరిపురం సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్సుఫార్మర్ ప్రారంభిస్తున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

తల్లాడ: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కోసం నిరంతరం కృషి జరుగుతుందని విద్యుత్‌శాఖ ఖమ్మం ఎస్ఈ ఇ.శ్రీనివాసాచారి అన్నారు. సోమవారం తల్లాడలో నూతనంగా ఏర్పాటుచేసిన 100కేవీ ట్రాన్సుఫార్మాలను ఆయన ప్రారంబించారు. కార్యక్రమలో సత్తుపల్లి డీఈ ఎల్.రాములు,బద్రు, ఏడీఈ నెల్లూరి సతీష్, ఏఈ రాయల ప్రసాద్‌పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఎర్రుపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ పరిధిలో రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎర్రుపాలెం-గంగినేని మధ్య 548 కిమీ వద్ద దిగువ లైన్ పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి (45) విజయవాడ వైపు వెళ్లే రైలుకిందపడి మృతి చెందాడు. మృతుడి వివరాలేవి తెలియదు, తెలుపురంగు గళ్లచొక్కా, నల్లరంగు ప్యాంట్ వేసుకుని నలుపురంగు చాయతో 5.5 అడుగుల ఎత్తు ఉన్నాడు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఖమ్మం రైల్వే ఎస్ఐ మృతుడి వివరాలు తెలిసిన వారు కింది నెంబర్లలో 8712658589, 9848114202నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నర్సింగ్ విద్యార్థినికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

వైరా, మే 12 (ఆంధ్రజ్యోతి): వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండలం చెరువుమాదారానికి చెందిన నర్సింగ్ మూడో సంవత్సరం విద్యార్థిని కల్లూరి కావ్యకు రూ.పదివేల ఆర్థిక సహాయాన్ని డాక్టర్ కాపా మురళీకృష్ణ అందజేశారు. సోమవారం కొల్లా రాంబాబు, నాగమణి దంపతులు అలాగే చింతోజు నాగేశ్వరరావు, సీత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కావ్యకు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో లగడపాటి ప్రభాకర్ రావు, ఉండ్రు శ్యాంబాబు, పి.ఉపేంద్రరావు, వై.బుచ్చిరామారావు, వజినేపల్లి చక్రవర్తి, డాక్టర్ డి.కోటయ్య, అబ్బూరి రమేష్ ఇతరులు పాల్గొన్నారు.